



మీతో మేము.. పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు తదితరులు



రీచార్జి చేస్తేనే సెల్‌ఫోన్ పని చేస్తుంది.. లేదంటే ఎవరికైనా ఫోన్ చేయాలంటే కుదరదు.. ఇదే తరహాలో ఇక విద్యుత్ సరఫరా జరుగుతుంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఇప్పుడు విద్యుత్ కనెక్షన్లకు ఉన్న మీటర్లను మార్చేస్తున్నారు. వాటి స్థానంలో స్మార్ట్‌మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లో స్మార్ట్‌మీటర్లను బిగించేశారు. వ్యాపార దుకాణాల్లో మీటర్లను మారుస్తున్నారు. ఆ తర్వాత పరిశ్రమలు, గృహాలకు మార్చనున్నట్లు సమాచారం. స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియను జూలై 2025 లోపు పూర్తి చేయాలని లక్ష్యంగా ఉంది. వ్యవసాయ మోటార్లకు మాత్రం స్మార్ట్‌మీటర్ల నుంచి మినహాయింపు ఇచ్చారు. ఈ విధానంలో ఇక విద్యుత్ బకాయిలు పేరుకుపోవు.. ముందుగా చెల్లిస్తేనే విద్యుత్ సరఫరా అయ్యే పరిస్థితులు రానున్నాయి.

మొబైల్ అనుసంధానం

స్మార్ట్ మీటర్లకు వినియోగదారుడి మొబైల్‌ను అనుసంధానం చేస్తారు. వినియోగదారుడు తన మొబైల్‌లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడు చేసుకోవాలి. ఈ యాప్ ద్వారా ఎంత మొత్తం కావాలంటే అంత నగదు రీచార్జి చేసుకోవాలి. ఎన్ని యూనిట్లు వినియోగం జరిగింది.. ఎంత రీచార్జి చేశారు.. ఎప్పుడు రీచార్జి గడువు ముగిస్తుంది.. వంటి సమగ్ర వివరాలు మొబైల్‌లోనే తెలుసుకోవచ్చు. రీచార్జి గడువు ముగిసే సమాచారం వినియోగదారుడి సెల్ నెంబర్‌కు సంక్షిప్త సమాచారం వస్తుంది.

కరెంట్‌కూ.. రీచార్జి

- ముందుగా నగదు చెల్లిస్తేనే సరఫరా
- విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వేగవంతం
- ఇప్పటికే వివిధ శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తి
- వ్యాపార దుకాణాల్లో ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్న వైనం
- పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 36,777 మీటర్ల ఏర్పాటు
- అన్ని కేటగిరీలకు తప్పనిసరి.. వ్యవసాయ మోటార్లకు మినహాయింపు
- జూలై 2025 లోపు స్మార్ట్ మీటర్ల బిగింపు పూర్తి చేయాలని లక్ష్యం


నరసరావుపేటలోని టీ స్టాల్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ వినియోగంలో ఇక సాంకేతికత రానున్నది. మొబైల్ రీచార్జి తరహాలోనే విద్యుత్ సరఫరా వినియోగంలోకి రానున్నది. ఇందులో భాగంగా కేటగిరీల వారీగా స్మార్ట్‌మీటర్లను బిగిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో వ్యవసాయ మీటర్లు మినహా అన్ని కేటగిరి సర్వీసులకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు విద్యుత్ శాఖ చర్యలు తీసుకుంది. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో ఇప్పటికే 36,777 స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మీటర్ల ఏర్పాటు ప్రక్రియ పూర్తయింది. వ్యాపార షాపుల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు శరవేగంగా జరుగుతోంది. మరో 15 రోజుల్లో వ్యాపార దుకాణాల్లో మీటర్ల ఏర్పాటు పూర్తి కానున్నది. తదుపరి దశలో పరిశ్రమల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 200 యూనిట్లు వినియోగంపై ఉన్న గృహ సర్వీసులకు, వాణిజ్య.. పరిశ్రమల సర్వీసులకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. స్మార్ట్ మీటర్ ఏర్పాటు ద్వారా వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు. ఈ విధానంలో ఇంటికి రీడింగ్ బిల్లు రావడం.. దానిని కట్టడం ఇక ఉండవు. వినియోగదారులు ఎంత మొత్తం రీచార్జి చేసుకుంటే ఆ మొత్తం అయిపోయే వరకు కరెంట్ సరఫరా ఉంటుంది. చెల్లించిన మొత్తం పూర్తయిన తర్వాత వెంటనే సరఫరా ఆగిపోకుండా కొంత సమయం వరకు వెసులుబాటు ఉంటుంది. విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు కార్యాలయాలకు వెళ్లి క్యూలో నిల్చొని బిల్లులు కట్టాల్సిన పని ఉండదు. తమ సెల్‌ఫోన్లో ఎస్పీడీసీఎల్ రూపొందించే యాప్ డౌన్‌లోడ్ చేసుకుని

జిల్లా	బిగించిన మీటర్లు
పల్నాడు	10,668
గుంటూరు	15,349
బాపట్ల	10,760

(మిగతా 6వ పేజీలో..)

నేరాల నివారణకు.. మీతో మేము

- ప్రజల్లో అవగాహనకు వినూత్న కార్యక్రమం
- మీ రక్షణ మా బాధ్యతన్న ఎస్పీ శ్రీనివాసరావు
- పోలీసులను అభినందించిన కలెక్టర్ అరుణ్‌బాబు


ట్రాఫిక్ బైక్‌లపై కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నేరాలకు సంబంధించిన వివిధ అంశాలపై అవగాహన, జాగ్రత్తలు తెలిపే విధంగా రూపొందించిన మీతో మేము.. కార్యక్రమాన్ని ఎస్పీ శ్రీనివాసరావు కలెక్టర్ అరుణ్‌బాబుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. మీతో మేము మీ రక్షణ మా బాధ్యత పేరుతో రూపొందించిన డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను, ట్రాఫిక్ సిబ్బంది కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మూడు ద్విచక్ర వాహనాలను జిల్లా పోలీసు కార్యాలయంలో కలెక్టర్, ఎస్పీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు నేరాల బారిన పడకుండా ఉండేందుకు, చైతన్యపరిచేలా, నేరాలపై అవగాహన కల్పించేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాటి నుంచి ఏవిధంగా తప్పించుకోవాలి, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలను ఈ డిస్‌ప్లే బోర్డుల ద్వారా ప్రజలకు తెలియజేస్తామన్నారు. మహిళలపై అనుచితంగా ప్రవర్తిస్తే ఎటువంటి శిక్షలు పడతాయో కూడా వివరిస్తామన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కల్పించుకుని ప్రాణాలను ఎలా రక్షించుకోవచ్చనే అంశాలపై రూపొందించిన వీడియోలను ప్రదర్శించి ప్రజలను అప్రమత్తం చేస్తామన్నారు. సమాజంలో పౌరులు బాధ్యతగా ఎలా ఉండాలనే అంశాలపై వీడియోలను రూపొందించామన్నారు. సామాజిక మాధ్యమాల్లో అనుచిత పోస్టులు పెట్టే వారిపై పోలీసులు తీసుకుంటున్న చర్యలను తెలియజేస్తామన్నారు. జిల్లాలోని 34 పోలీస్ స్టేషన్ల వద్ద ఈ డిజిటల్ డిస్‌ప్లే స్క్రీన్లను ఏర్పాటు చేస్తామన్నారు. భవిష్యత్‌లో విద్యాసంస్థలు, వైద్యశాలలు, జనసాంద్రత ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటుచేయడానికి ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. నేరాలను అధిగమించేందుకు ప్రజలను చైతన్యవంతం చేసేలా అవగాహన కల్పించడానికి ఎస్పీ ఆధ్వర్యంలో రూపొందించిన కార్యక్రమాన్ని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో అడ్మిన్ ఏఎస్పీ సంతోష్, డీఎస్పీలు నాగేశ్వరరావు, హనుమంతరావు, జగదీష్, వెంకటరమణ, జిల్లాలోని సీఐలు, ఎస్ఐలు సిబ్బంది పాల్గొన్నారు.


మాసశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ దేవస్థానంలో శుక్రవారం లక్ష బిల్వార్చన అనంతరం విశేష పుష్పాలంకరణలో శ్రీత్రికోటేశ్వరస్వామి - నరసరావుపేట, ఆంధ్రజ్యోతి

నేటి నుంచి వీరారాధన ఉత్సవాలు


ముస్తాబు చేస్తున్న ధ్వజస్తంభం

8

మద్యం మత్తులో ఉపాధ్యాయుడు

గిరిజన నేతల ఫిర్యాదుతో డిప్యూటేషన్‌పై బదిలీ

6

నాటుబాంబుల కేసులో కోర్టులో లొంగిపోయిన వైసీపీ నేత

14 రోజులు రిమాండ్ విధించిన మాచర్ల అదనపు సివిల్ జడ్జి

అమ్మో.. ఫెంగల్


కొల్లూరు: క్రాప అడ్డరోడ్డు వద్ద ఆరబోసిన ధాన్యాన్ని పట్టాలు కప్పుకునేందుకు గుట్టగా చేస్తున్న రైతులు


మాచర్ల: రెంటచింతలలో ధాన్యంపై పట్టలు కప్పిన దృశ్యం


తెనాలి: పెదరావూరు దగ్గర నేలవాలిన వరిచేను

- తుఫాన్ ప్రభావం.. రైతుల్లో ఆందోళన
- ముప్పులేదన్నా ఈదురు గాలులు.. వర్షం
- కల్లాల్లో, రోడ్లపైన ధాన్యాన్ని తరలిస్తోన్న అన్నదాతలు
- మూడో రోజూ హార్బర్‌లో ఒకటో నెంబరు ప్రమాద సూచిక
- చేతికొచ్చిన పంట నోటికందదేమోనని భయపడుతున్న రైతులు

బాపట్ల, తెనాలి, గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం బలపడి తీవ్ర తుఫాన్‌గా మారింది. ఫెంగల్ పేరుతో దూసుకొస్తోన్న తుఫాన్ బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాలపై ప్రభావం చూపదని అధికారులు ప్రకటిస్తున్నారు. అయితే బాపట్ల జిల్లా పరిధిలోని తీరప్రాంతంలో అలలు చిన్నపాటి స్థాయిలో పైకి వస్తున్నాయి. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్న హెచ్చరికలతో పడవలన్నీ ఒడ్డునే ఉన్నాయి. బాపట్ల, గుంటూరు జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఆకాశం మేఘావృతమైంది. తుఫాన్ ప్రభావంతో చలిగాలులు పగటి వేళల్లో కూడా ఎక్కువగా వీస్తున్నాయి. ఇక బాపట్ల జిల్లాలోని తీర ప్రాంతంతో పాటు గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం మధ్యాహ్నం నుంచి చిరుజల్లులు పడ్డాయి. కోతకోసి ఆరబోసి రోడ్లపై, కల్లాల్లో ఉంచిన ధాన్యాన్ని వర్షం తడిపేసింది. రెండు రోజులుగా వాతావరణం ఎండ, మబ్బులతో దోబూచులాడుతున్నా వర్షం పడదన్న ధైర్యంతో రైతులు వరి కోతలు కోస్తున్న, ఇప్పటికే కోసిన వారు తుఫాన్ ప్రభావంతో వణికిపోతున్నారు. కల్లాల్లో ధాన్యం ఉన్న రైతులు వర్షంతో తీవ్ర ఆందోళనలో ఉన్నారు. వర్షం పడదన్న భరోసాతో ఉన్న రైతులను వర్షం నష్టపరిచింది. కొందరు ధాన్యపు రాశులపై పట్టాలు కప్పేసుకోగా మరికొందరు గోతాలకెత్తి మిల్లులకు తోలేందుకు సిద్ధమయ్యారు. కోత కోయకుండా ఉంచిన పైరు గాలులకు చాలాచోట్ల నేలవాలింది. చిరుజల్లులతో పంట నేలవాలి గింజ కూడా దక్కదని రైతులు ఆవేదన చెందుతున్నారు. వాతావరణ శాఖ మూడు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షం పడుతుందని హెచ్చరికలు జారి చేయడంతో అన్నదాతలు భయాందోళనలకు గురవుతున్నారు. తుఫాన్ కారణంగా నిజాంపట్నం హార్బర్‌లో మూడో రోజైన శుక్రవారం ఒకటో నెంబరు ప్రమాదసూచిక కొనసాగుతుంది. సముద్రం కల్లోలంగా ఉండటంతో భయాందోళనతో వారం క్రితం వేటకు వెళ్ళిన బోట్లన్నీ సురక్షితంగా హార్బర్‌కు చేరుకున్నాయి.

వరి కోయవద్దు

తుఫాన్ ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్నందున రెండు, మూడు రోజుల పాటు వరి కోతలు కోయకుండా ఉండటం మంచిదని గుంటూరు జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు తెలిపారు. కోత కోసిన తర్వాత వర్షం కురిస్తే ధాన్యం పాడయ్యే అవకాశం ఉందన్నారు. ఇప్పటివరకు కోత కోసిన ధాన్యం చాలా వరకు అమ్మకాలు జరిగాయన్నారు. వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.


కొల్లిపర మండలం చక్రాయపాలెంలో ధాన్యంపై పట్టలు కప్పుతున్న రైతులు

తాత్కాలికంగా వచ్చి.. అంతా తానై

- మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో ఆ అధికారే కీలకం
- పేకాట నుంచి ఇసుక ట్రాక్టర్ల వరకు మామూళ్లు వసూలు

మాచర్లటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో ఓ అధికారి తాత్కాలికం(సీ నంబరు)పై వచ్చి అంతాతానై అధికారం చెలాయిస్తున్నాడు. ఎస్‌హెచ్‌వో, ఎస్ఐలు కొత్త వారు కావడంతో స్టేషన్ వ్యవహారాలను నచ్చిన విధంగా నిర్వర్తిస్తున్నాడు. గతంలో ఇక్కడ చేసిన అనుభవం ఉండడం ఆయనకు కలిసొచ్చిన అంశం. అప్పటి గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు మాచర్ల పట్టణ పోలీస్ స్టేషన్లో సిబ్బంది కొరత ఉండడంతో దాచేపల్లిలో విధులు నిర్వహిస్తున్న ఆ అధికారిని సీ నంబరు కింద మాచర్లకు పంపారు. ఇటీవల పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించి నిర్వాహకులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదుతోపాటు వారి నుంచి ముడుపులు దండుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసులోనే ఇల్లు అద్దెకు ఇచ్చిన ఓనరును కూడా బెదిరించి నగదు వసూలు చేసినట్లు సమాచారం. వెల్దుర్తి మండలం రచ్చమలపాడు నుంచి మాచర్లకి మట్టిని తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించాడు. ఈ కేసులో ట్రాక్టర్ల యజమానులపై ఒక్కో ట్రాక్టరుకు రూ.5 వేలు చొప్పున జరిమాన విధించడంతోపాటు రూ.20 వేలు చొప్పున ముడుపులు వసూలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి.



వైసీపీ నాయకులకు లీకులు..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకుల చేసిన అరాచకాలపై ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోంది. ఈ తరుణంలో పోలీస్‌స్టేషన్లో అప్పటి కేసులకు సంబంధించిన ముఖ్య సమాచారాన్ని ఈ అధికారి వైసీపీ వారికి గుట్టుచప్పుడు కాకుండా చేరవేస్తున్నాడన్న ఆరోపణలున్నాయి. దీంతో వైసీపీ నాయకులు ముందుగానే తప్పించుకుని పోతున్నట్లు సమాచారం.

గత సంఘటనలో వీఆర్..

గతంలో ఈ స్టేషన్‌లోనే ఓ కేసులో ఎస్‌హెచ్‌వోకు తెలియకుండా ఓ మహిళపై కేసు నమోదుచేసి ముడుపులు అందుకున్నారన్న ఆరోపణలతో అప్పటి ఎస్పీ ఈ అధికారిని వీఆర్‌కు పంపారు. అయితే వైసీపీ నేతల పలుకుబడితో వీఆర్‌ను రద్దు చేయించుకుని మాచవరంలో పోస్టింగ్ ఇప్పించుకున్నాడు. తదుపరి దాచేపల్లికి బదిలీపై వెళ్లి అక్కడి నుంచి సీ నెంబరుపై మాచర్లలో విధులు నిర్వహిస్తున్నాడు. మాచర్ల పట్టణ పోలీస్‌స్టేషన్లో ఈ అధికారి తతంగంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ఎలర్జీలపై నేడు, రేపు జాతీయ సదస్సు


డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్

మంగళగిరి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చినకాకాని ఎన్నారై మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో శని, ఆదివారాల్లో ఎలర్జీలపై జాతీయ స్థాయి కాన్ఫరెన్స్ జరుగుతుందని సదస్సు కన్వీనర్ డాక్టర్ కేవీఎస్ సాయిప్రసాద్ తెలిపారు. కృష్ణా, గుంటూరు జిల్లాల పిల్లల వైద్యుల సమాఖ్య ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సదస్సు జరుగుతుందన్నారు. మారుతున్న వాతావరణం, పెరుగుతున్న కాలుష్యం కారణంగా దేశంలో ఎంతో మంది ఎలర్జీలు, సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారని చెప్పారు. పిల్లలకు సంబంధించిన ఎలర్జీలపై నూతన వ్యాధి నిర్ధారణ పరిశోధనలు, పరీక్షలు, చికిత్సా విధానాల మీద సదస్సులో చర్చిస్తామన్నారు. జాతీయ పిల్లల ఎలర్జీ చాప్టర్ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణమోహన్ నాయక్, జాతీయ కార్యదర్శి డాక్టర్ నారాయణరెడ్డి, కోశాధికారి ధనేష్ వాల్యేకర్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

వాకా అంజిరెడ్డికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న వాకా అంజిరెడ్డి

గుంటూరు(విద్య), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అస్సాంలోని సిల్ చార్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పరిశోధన చేసినందుకు గుంటూరుకు చెందిన వాకా అంజిరెడ్డికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ బాదల్ సోని పరిశోధన పర్యవేక్షణలో 'డీప్ లెర్నింగ్ ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్ కనుగొనడం' అనే అంశంపై అంజిరెడ్డి పరిశోధన చేశారు. 22వ స్నాతకోత్సవంలో అంజిరెడ్డికి డాక్టర్ రెడ్డి పట్టాను అందించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, పరిశోధకులు, బంధువులు అంజిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రస్తుతం డాక్టర్ అంజిరెడ్డి వాకా లెండి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, విజయనగరంలో ప్రొఫెసర్, పరిశోధన, అభివృద్ధి విభాగంలో మెంబర్‌గా పని చేస్తున్నారు.

స్టెప్ సీఈవోగా చంద్రముని

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): స్టెప్ సీఈవోగా చంద్రముని రంగాలని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలానే డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ రంగయ్యని పౌరసరఫరాల శాఖ విజిలెన్స్ విభాగంలో నియమించింది. ఎక్సైజ్‌లో అసిస్టెంట్ సెక్రెటరీ(సర్వీసెస్) హోదాలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కలెక్టర్ పెంచల ప్రభాకర్‌ని ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎస్‌డీసీ(అడ్మిన్)గా నియమిస్తూ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

అయ్యప్ప స్వాములకి ఆర్టీసీ టూర్ ప్యాకేజీలు

- శబరిమల యాత్రతోపాటు ఇతర క్షేత్రాలకు ప్రతిపాదనలు

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ఆర్టీసీ టూర్ ప్యాకేజీలతో సిద్ధమైంది. అయ్యప్ప స్వాములకు స్పెషల్ సర్వీసులను ఏర్పాటు చేసి అదనపు ఆదాయం కోసం టూర్ ప్యాకేజీలతో అందుబాటులో ఉంచుతున్నారు. శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములు ఒక బృందంగా చేరి 30 మంది స్వాములు ఉంటే వారికి ప్రత్యేక బస్సు సిద్ధం చేస్తామని గుంటూరు-2 డిపో మేనేజర్ అబ్దుల్ సలాం తెలిపారు. డిపో నుంచి పది కిలో మీటర్ల దూరంలో ఎక్కడికైనా బస్సును అయ్యప్పస్వాముల వద్దకు పంపిచేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మంచి కండిషన్‌లో ఉన్న బస్సుతోపాటు సుశిక్షితులైన డ్రైవర్‌లను యాత్ర బస్సులకు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

గుంటూరు నుంచి బయల్దేరి..

శబరిమల యాత్రకు వెళ్లే అయ్యప్ప స్వాములకు ప్రత్యేక టూర్ ప్యాకేజీలను సిద్ధం చేస్తున్నారు. గుంటూరు నుంచి బయల్దేరి నేరుగా కాణిపాకం, అరుణాచలం, పళని, ఈషా టెంపుల్, గురు వాయూర్, ఎరుమేలి, పంబ, సన్నిధానం అనంతరం తిరుగు పయనంలో త్రివేండ్రమ్, కన్యాకుమారి, మధురై, రామేశ్వరం, తిరుచందూర్, శ్రీరంగం, శివకంచి, విష్ణు కంచి, శ్రీకాళహస్తి మొదలైన పుణ్య క్షేత్రాలను దర్శించుకుని గుంటూరు చేరుకుంటుంది. అయ్యప్ప స్వాముల కోరిక మేరకు సూపర్ లగ్జరీ (2+2)పుష్ బ్యాక్, అల్ట్రా డీలక్స్ బస్సులు అందుబాటులో ఉంచుతున్నారు. స్వాముల కోరినటువంటి క్షేత్రాలకు బస్సులు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు.

ప్యాకేజీ ధరలు

అయ్యప్ప స్వాములకు టూర్‌కు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సు ఏడు రోజుల టూర్‌కు ప్యాకేజీ బస్సుకు రూ. 2,49,000 కాగా 10 రోజుల టూర్ ప్యాకేజీ రూ. 2,85,000, 12 రోజుల టూర్‌కి రూ. 3,34,000, అలానే అల్ట్రా డీలక్స్ బస్సుకి ఏడు రోజుల టూర్‌కి రూ.2,65,000, అదే పది రోజుల టూర్‌కి రూ. 3,0,2000 కాగా 12 రోజుల టూర్‌కి రూ.3,55,000 తెలిపారు.

తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేయండి

- తరచూ నేరాలకు పాల్పడే 10 మంది జాబితాను రూపొందించండి
- రాత్రి గస్తీ సమయంలో అనుమానితుల వివరాలు సేకరించండి
- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ సతీష్ కుమార్


జిల్లా నేర సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తీవ్ర నేరాలకు పాల్పడే వారిని కట్టడి చేసే బాధ్యత డీఎస్పీలదేనని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన అక్టోబరు నెల నేర సమీక్షా సమావేశంలో ఆయన అధికారులకు పలు అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మహిళలు, పిల్లలు, తీవ్ర నేరాలు, వ్యక్తుల అదృశ్యం, ఆధారాలు తెలియని మరణాలు, రోడ్డు ప్రమాదాల కేసులకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. 'మహిళా.. మీ కోసం' కార్యక్రమం ద్వారా మహిళలు, ఆడ పిల్లల రక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. కోర్టులో కేసులకు సంబంధించి త్వరగా ఛార్జిషీట్, పెండింగు దస్త్రాల దాఖలుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో తరచూ నేరాలకు పాల్పడే 10 మంది నిందితుల జాబితాను రూపొందించి వారి కార్యకలాపాలను పర్యవేక్షిస్తుండాలన్నారు. రాత్రి గస్తీ సమయంలో అనుమానితుల వివరాల సేకరించాలన్నారు. అన్ని ముఖ్య కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలన్నారు. లోక్ అదాలత్ ద్వారా సాధ్యమైనన్ని కేసులు పరిష్కరించాలన్నారు. గంజాయి, ఇతర మాదకద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేయడంతోపాటు నిందితులకు శిక్షలు వేయించడంలో చొరవ చూపాలన్నారు. ఛార్జిషీట్లు, సమన్లు, నాన్ బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉంచకుండా సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. పోక్సో, రేప్ కేసుల్లో దర్యాప్తు వేగవంతంగా చేయాలని అన్నారు. మహిళలు, చిన్నారుల అదృశ్యం కేసుల్లో అలసత్వం వహించవద్దన్నారు. చోరీ కేసుల్లో నిందితులను పట్టుకుని ప్రాపర్టీ రికవరీ శాతాన్ని పెంచాలని చెప్పారు. సఖి (వన్ స్టాప్ సెంటర్ ఫర్ ఉమెన్ ప్రొటెక్షన్) న్యాయవాది విజయలక్ష్మి సఖి తరుపున మహిళలకు అందించే సేవలను వివరించారు.

రివార్డులు, ప్రశంసాపత్రాలు

జిల్లాలో విధి నిర్వహణలో ప్రతిభ చూపిన పోలీస్ అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రశంసాపత్రాలు, రివార్డులు అందించారు. వాటిని అందుకున్న వారిలో తెనాలి డీఎస్పీ జనార్దన్ రావు, , సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు, మహిళా పీఎస్ డీఎస్పీ సుబ్బారావు, ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్, నగరంపాలెం సీఐ వీరా నాయక్, చేబ్రోలు ఎస్సై వెంకటకృష్ణ, తెనాలి రూరల్ ఎస్సై ప్రతాప్ కుమార్, కొల్లిపర ఎస్సై కోటేశ్వరరావు, ప్రత్తిపాడు ఎస్ఐ నాగేంద్ర కుమార్, పట్టాభిపురం స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుళ్లు ఫణిరాజు, నాగేశ్వరరావు, నల్లపాడు హెడ్ కానిస్టేబుల్ నాగరాజు, కానిస్టేబుల్ వీర్ల అంకయ్య తదితరులు ఉన్నారు. స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుళ్ల ఇచ్చిన సమాచారంతో గంజాయి ముఠాలను అదుపులోకి తీసుకున్నందుకుగానూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. జిల్లా అదనపు ఎస్పీలు రమణమూర్తి, రవిబాబు, హనుమంతు, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్‌కూ.. రీచార్జి

(5 పేజీ తరువాయి)

అందులో తమ సర్వీసు నంబరును నమోదు చేసుకుని కట్టవచ్చు. ఎప్పటికప్పుడు యాప్ ద్వారా తమకున్న విద్యుత్ సర్వీసుకు రీచార్జి చేసుకునే సౌకర్యం ఉంటుంది. దీనివల్ల అపరాధ రుసుం చెల్లించే పరిస్థితి ఉండదు. మీటర్ రీడింగ్ తీసే సమయంలో తప్పులు దొర్లే పరిస్థితి ఉండదు. స్మార్ట్ మీటర్‌లో ఏర్పాటు చేసిన ఇన్ బిల్ట్ సిమ్ ద్వారా ఎప్పటికప్పుడు మీటర్‌లో రికార్డు అయ్యే మొత్తం సమాచారం ఆన్‌లైన్ ద్వారా చూసుకునే వీలుంటుంది. ఈ నేపథ్యంలో మూడు జిల్లాల్లో లక్ష్యాల మేర మీటర్ల ఏర్పాటు చేస్తున్నట్లు విద్యుత్ శాఖ లెక్కలు తెలియజేస్తున్నాయి. వ్యవసాయం మినహా అన్ని కేటగిరి సర్వీసులకు మీటర్లు బిగింపు తప్పని సరి చేస్తున్నారు.

వినియోగదారులకు అవగాహన

విద్యుత్ వినియోగం 200 యూనిట్లకుపైగా ఉన్న గృహ వినియోగదారులందరికీ స్మార్ట్ మీటర్లను బిగించనున్నారు. వ్యాపార, వాణిజ్య, పరిశ్రమలకు పూర్తియిన వెంటనే గృహాలకు మీటర్ల బిగింపునకు విద్యుత్ శాఖ చర్యలు చేపట్టింది. మీటర్ల బిగింపు పూర్తయితే వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ల వల్ల నష్టాలు.. అధిక బిల్లు తదితరాలపై వినియోగదారులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే జూలై నుంచి స్మార్ట్ మీటర్లు వినియోగంలోకి రానున్నాయి. అప్పటి వరకు ప్రస్తుతం ఉన్న విధానంలోనే విద్యుత్ బిల్లులు చెల్లించాలని అధికారులు తెలిపారు. స్మార్ట్ మీటర్ బిగించినా దానిని యాక్టివేట్ చేయలేదని చెబుతున్నారు. మీటర్ల ఏర్పాటు పూర్తయిన వెనువెంటనే రీచార్జి విధానం అమల్లోకి రానున్నది.

విద్యుత్ చోరీకి చెక్

విద్యుత్ స్మార్ట్‌మీటర్ల ద్వారా విద్యుత్ చౌర్యం కూడా తెలిసిపోతుంది. ఎక్కడ విద్యుత్‌చౌర్యం జరుగుతుందో గుర్తించే విలుంటుందని అధికారులు చెబుతున్నారు. 11 కేవీ, 33 కేవీ ఫీడర్లు, అధిక సామర్థ్యం గత నియంత్రికల వద్ద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయడం వల్ల ఎంత విద్యుత్ సరఫరా అవుతోంది, వినియోగం, వృథా ఎంత వంటి వివరాలు ఆయా మీటర్లలో ఉన్న సిమ్‌లలో నమోదవుతుంది. ఫీడర్ నియంత్రికలపై హెచ్చు, తగ్గుల సరఫరా అవుతున్నా యాప్‌లో నమోదు అవుతుంది.

మిర్చియార్డులో కాటాదారుల పరేడ్


మిర్చియార్డులో వేమెన్‌ల పరేడ్‌లో సెక్రెటరీ ఆంజనేయులు

గుంటూరు, నవంబరు 29(ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కాటాదారు(వేమెన్)ల పరేడ్‌ని గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ తేజ ఆదేశాల మేరకు శుక్రవారం యార్డు పరిపాలన భవనంలో సెక్రెటరీ వినుకొండ ఆంజనేయులు ఈ తనిఖీని నిర్వహించారు. మొత్తం 108 మంది కాటాదారులకు 86 మంది హాజరయ్యారు. మిగతా 22 మంది వేర్వేరు కారణాలను పేర్కొంటూ గైర్హాజరయ్యారు. ఈ సందర్భంగా సెక్రెటరీ ఆంజనేయులు మాట్లాడుతూ సోమవారం నుంచి కాటాదారులంతా నిర్ణీత సమయానికి డ్రస్‌కోడ్, ఐడీ కార్డులు ధరించి హాజరు కావాలన్నారు. ఎవరి పేరు మీద అయితే లైసెన్సు ఉందో వాళ్లే విధులకు హాజరై కాటాలు వేసి చీటీలు ఇవ్వాలని స్పష్టం చేశారు. తాము ప్రతి ఒక్క లైసెన్స్‌ని తనిఖీ చేస్తామని, నిబంధనలకు విరుద్ధంగా లైసెన్సుదారు స్థానంలో వేరే వాళ్లు ఉంటే వాటిని రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైతే గైర్హాజరయ్యారో వారంతా సోమవారం యార్డు పరిపాలన భవనానికి రావాలని ఆదేశించారు. ఈనామ్ పద్ధతిలో ట్రేడింగ్ జరిగిన మిరపకాయలను కాటా వేయాలన్నారు.

ఆటోని సీజ్ చేసి రూ. 6 వేలు పెనాల్టీ వేశాం

మిర్చియార్డులో సుమారు 50 టిక్కీలను జీరో బిజినెస్‌లో బయటకు తరలించాలని ఒక వ్యాపారి ప్రయత్నించగా అతనికి తొలి హెచ్చరిక జారీ చేసి రూ. 6 వేలు పెనాల్టీ వేశామని సెక్రెటరీ తెలిపారు. మరోసారి జీరో బిజినెస్‌కు పాల్పడితే వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. సమావేశంలో ఇతర అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమర్థుడైన మన్నవకు.. సరైన పదవి

- కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్
- అట్టహాసంగా ఏపీటీఎస్ చైర్మన్‌గా మోహనకృష్ణ పదవీ బాధ్యతల స్వీకరణ



సభలో మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన మన్నవ మోహనకృష్ణ

గుంటూరు(తూర్పు), నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో మన్నవ మోహనకృష్ణ సమర్థతను చంద్రబాబు నాయుడు, లోకేశ్ గుర్తించి సరైన కీలక పదవిని అప్పగించారని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. రింగురోడ్డులోని సిద్ధార్థ గార్డెన్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్(ఏపీటీఎస్) చైర్మన్‌గా మన్నవ మోహనకృష్ణ బాధ్యతల స్వీకార కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యాభ్యాసం నుంచి అమెరికా ప్రయాణం వరకు మన్నవ మోహనకృష్ణ జీవితం యువతకు స్ఫూర్తిని చేలా ఉంటుందన్నారు. గత పదేళ్లగా ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌కు, బసవతారకం క్యాన్సర్ ఆస్పత్రికి మన్నవ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆలోచనలతో సాంకేతికతలో రాష్ట్రం పురోగమిస్తుందని అన్నారు. ఏపీటీ ఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ కీలకమైన పదవి అప్పజెప్పిన చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకోవడంలో చంద్రబాబు నాయుడు తొలి జాబితాలో ఉంటారని, ఆయన అడుగుజాడల్లో నడుస్తానని అన్నారు. వచ్చే ఐదేళ్లలో టెక్నాలజీ రంగంలో 20 లక్షల ఉద్యోగాలను కల్పిస్తామని చెప్పిన నారా లోకేశ్ ఆలోచనలను ముందుకు తీసుకువెళ్తానని స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని టెక్నాలజీ హబ్‌గా మార్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అభిమానులు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో అభిమానులు, కూటమి కార్యకర్తలు సందడి చేశారు.

భారీగా హాజరైన ప్రజా ప్రతినిధులు

కార్యక్రమానికి భారీగా ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు. ఎమ్మెల్యేలు చదలవాడ అరవింద బాబు, ప్రత్తిపాటి పుల్లారావు, వేగ్నేశ నరేంద్ర వర్మ, జూలకంటి బ్రహ్మారెడ్డి, నక్కా ఆనందబాబు, బూర్ల రామాంజనేయులు, నసీర్ అహ్మద్, గళ్లా మాధవి, యార్లగడ్డ వెంకటరావు, ఏపీఐడీసీ, మాదిగ, విభిన్న ప్రతిభావంతుల, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ల చైర్మన్‌లు డేగల ప్రభాకర్, ఉండవల్లి శ్రీదేవి, గోనుగుంట్ల కోటేశ్వరరావు, పట్టాభిరామ్, కూటమి నాయకులు నిమ్మల శేషయ్య కనపర్తి శ్రీనివాసరావు, బోనబోయిన శ్రీనివాస్, వేముల కొండ శ్రీనివాస్, అబ్బూరి మల్లి, మన్నవకు అభినందనలు తెలిపారు.

సీఎం సహాయనిధికి రూ.10 లక్షల విరాళం


ముఖ్యమంత్రికి చెక్కు అందిస్తున్న కల్నల్ డాక్టర్ కేపీరావు, సూర్యకుమారి

చుండూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పెదగాదెలవర్రుకు చెందిన కల్నల్ డాక్టర్ కేపీరావు, ఎన్నారై గుత్తికొండ సూర్యకుమారి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని ఉండవల్లిలోని ఆయన నివాసంలో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షల విరాళంగా చెక్కును అందించారు. పెదగాదెలవర్రులో కల్నల్ డాక్టర్ కేపీరావు 1960లో ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారు. ఆర్మీలో ఉన్నత ర్యాంకులో పని చేస్తూ డిప్యుటేషన్‌పై డీఆర్‌డీఏ శాస్త్రవేత్తగా 1982-88 వరకు మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాంతో కలిసి పని చేశారు. 1995లో మిలటరీ విభాగపు ఆర్‌అండ్‌డీ విభాగంలో శాస్త్రవేత్తగా అనేక నూతన ఆవిష్కరణలు చేశారు. ఓ కుగ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని దేశం గర్వించదగిన స్థాయికి చేరిన కల్నల్ డాక్టర్ కేపీరావుకు ముఖ్యమంత్రి అభినందనలు తెలిపి సత్కరించారు. స్వగ్రామానికి సేవలందించినందుకుగానూ ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, మాజీ సర్పంచి ప్రభావాణి, రాహుల్ సాంకృత్యాయిన్, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

సీఐడీతో విచారణ జరిపించాలని సీఎంను కోరతా

- ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): సౌర విద్యుత్ ఒప్పందాలకు సంబంధించి వెలుగుచూసిన అవినీతి ఆరోపణలపై సీఐడీతో విచారణ జరిపించాలని ముఖ్యమంత్రిని కోరతామని ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి.ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌర విద్యుత్ పేరిట వేల కోట్ల రూపాయల దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఇందులో మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అడ్డంగా దొరికిపోయారని విమర్శించారు. నిజాన్ని నిగ్గుతేల్చి దోషులకు శిక్ష పడాలంటే సరైన దర్యాప్తు జరగాలని అన్నారు. అధికారం చేతుల్లో ఉంది కదా అని కేంద్ర విద్యుత్ చట్టాన్ని తుంగలోకి తొక్కి బిడ్డింగ్ రూల్స్‌కు విరుద్ధంగా బరితెగించి దోపిడీకి పాల్పడ్డారన్నారు. సౌర ఒప్పందాల్లో అతని గ్యాంగ్ ఏతప్పు చేయకుంటే వారి అవినీతిపై అమెరికాలో కేసు ఎందుకు పెడతారని సూటిగా ప్రశ్నించారు. నాటి రాష్ట్ర విద్యుత్ మంత్రికే తెలియకుండా అర్ధరాత్రి ఒప్పందం ఎందుకు చేసుకోవాల్సి వచ్చిందో జగన్ సమాధానం చెప్పాలన్నారు. వచ్చిన ప్రతిపాదనలపై ఒక్కరోజులోనే కేబినెట్‌లో ఎలా ఆమోదం పొందారని, ఏం చర్చించారనే విషయాలు కూడా ప్రజలకు వివరించాలన్నారు.

ఉపాధ్యాయుడు మద్యం తాగి విధులకు హాజరు


హెచ్ఎం దుర్గాభవానితో మాట్లాడుతున్న గిరిజన నేతలు

మాచర్ల రూరల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మాచర్ల మండలం తాళ్లపల్లి పంచాయతీ ఏడోమైలు గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలలో సుమారు 450 మంది విద్యార్థినులు విద్యను అభ్యసిస్తున్నారు. అయితే ఈ పాఠశాల వివాదాలకు కేరాఫ్‌గా మారింది. ఇక్కడ పని చేస్తున్న ఉపాధ్యాయుడు వై.వెంకటేశ్వర్లు మద్యం తాగి విధులకు వస్తున్నారనీ, ఈ విషయంపై ప్రశ్నించిన తోటి ఉపాధ్యాయుడు బి.శ్రీనివాసరావుపై చేయి చేసుకున్నాడనీ, మహిళా టీచర్లు, విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికోన్నత ఆశ్రమ పాఠశాలను టీడీపీ గిరిజన నేత రెడ్యానాయక్, కోఆప్టెడ్ సభ్యుడు బి.వెంకటేశ్వర్లు నాయక్ శుక్రవారం పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలపై ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకున్నారు. ఈ విషయాలను మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, జిల్లా కలెక్టర్ అరుణ్ బాబు దృష్టికి తీసుకెళ్తామని విద్యార్థినులకు హామీ ఇచ్చారు. బాలికల పాఠశాలలో మహిళా టీచర్లు మాత్రమే విధులు నిర్వహించాలని జీవో ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గిరిజన నేతలు పేర్కొన్నారు.

డిప్యుటేషన్‌పై బదిలీ

మద్యం తాగి పాఠశాలకు రావడం, తోటి ఉపాధ్యాయుడిపై చేయి చేసుకోవడం వంటి సంఘటనలపై డీటీడబ్ల్యూవోకు సమాచారం ఇచ్చినట్లు పాఠశాల హెచ్ఎం దుర్గా భవాని చెప్పారు. దీంతో ఉపాధ్యాయుడు వై.వెంకటేశ్వర్లును డిప్యుటేషన్‌పై హనుమాపురం తండాకు బదిలీ చేసినట్లు తెలిపారు.

కోర్టులో లొంగిపోయిన వైసీపీ నేత మన్నెయ్య


మన్నెయ్య (ఫైల్)

దుర్గి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దుర్గి మండలం జంగమహేశ్వరపాడుకు చెందిన వైసీపీ నేత ఊరిబిండి మన్నెయ్య శుక్రవారం మాచర్ల పట్టణంలోని అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టులో లొంగిపోయాడు. జడ్జి శ్రీనివాస కల్యాణ్ అతనికి 14 రోజులు రిమాండ్ విధించారు. దుర్గి పోలీసులు మన్నెయ్యను గురజాల సబ్‌జైలుకు తరలించారు. ఈ ఏడాది మే 8న ఎన్నికల సమయంలో జంగమహేశ్వరపాడులో పోలీసులు నాటుబాంబులు, వేట కొడవళ్లను గుర్తించారు. కాగా జూలై 7న అదే గ్రామంలో నాటుబాంబు పేలడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఈ కేసులకు సంబంధించి పోలీసులు అప్పట్లో పలువురిని అదుపులోకి తీసుకుని విచారించారు. మన్నెయ్యను ప్రధాన నిందితునిగా గుర్తించి కేసు నమోదు చేశారు. కాగా అప్పటికే మన్నెయ్య అజ్ఞాతంలోకి వెళ్లాడు. అయితే శుక్రవారం మాచర్ల కోర్టులో లొంగిపోవడంపై సర్వత్రా చర్చనీయాంశమైంది.

బాలల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): బాలలపై జరిగే దోపిడీ, హింస, వేధింపులకు కారణమయ్యే వివాహాలు, లైంగిక నేరాలు, అక్రమ రవాణా మొదలగు అంశాలను క్షేత్రస్థాయిలో అరికట్టి వారి హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు ఆదిలక్ష్మి, జడ్పీ డిప్యూటీ సీఈవో చొప్పర కృష్ణ అన్నారు. గుంటూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి కిశోరి వికాసం శిక్షకుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా మహిళా, శిశు అభివృద్ధి సంస్థ పథక సంచాలకులు ఎం.ఉమాదేవి అధ్యక్షత వహించారు. జిల్లా బాలల పరిరక్షణ అధికారి విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.05
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	114,122,133
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

46,683 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు శుక్రవారం 40,183 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 46,683 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 32,927 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			**ఏసీ కామన్ వెరైటీ**		
334	7500	15000	334	7500	15800
నెంబరు. 5	8500	12000	నెంబరు.5	8000	9500
273	11000	11800	273	10500	14000
341	8000	13500	341	7500	14500
4884	12000	12000	4884	--	--
సూపర్ 10	--	–	సూపర్ 10	8800	12000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	7500	16500	తేజ	7500	16500
బ్యాడిగి	8000	14500	బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	9000	14000	దేవనూరు డీలక్స్	10000	10000
తెల్లకాయలు	4500	11000	తెల్లకాయలు	4200	10000

జాబ్‌మేళాలో 79 మందికి ఉద్యోగాలు

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్ర వారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ జాబ్‌మేళాకు నాలుగు కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా 101 మంది విద్యార్థులు హాజర య్యారు. వివిధ రకాల ఉద్యోగాలకు 79 మంది ని ఎంపిక చేసినట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజిరావు తెలిపారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ సిబ్బంది, పిడుగురాళ్ల స్కిల్ హబ్ కో-ఆర్డినేటర్ పి.శ్రీకాంత్, ఆర్.కిరణ్ నాయక్, రామకృష్ణారెడ్డి, మహిధర్, మస్తాన్, ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి తదితరులు హాజరై ఎంపికైన వారికి నియామకపత్రాలు అందజేశారు.

నేడు మున్సిపల్ సమావేశం

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పిడుగురాళ్ల పురపాలక సంఘ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగనున్నదని కమిషనర్ పి.శ్రీధర్ తెలిపారు. చైర్‌పర్సన్ కొత్త వెంకట సుబ్బారావు అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులు, అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

నేడు నగర పంచాయతీ సమావేశం

దాచేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ సమావేశం శనివారం దాచేపల్లిలోని సచివాలయం-1లో జరుగుతుందని నగర పంచాయతీ కమిషనర్ అప్పారావు శుక్రవారం తెలిపారు. చైర్‌పర్సన్ కొప్పుల సుబ్బమ్మ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని, సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

నేడు పింఛన్‌ల పంపిణీ

మాచవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మాచవరం మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం వివిధ రకాల పింఛన్‌లు పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంపీడీవో పీ.శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం రావటంతో ఒక రోజు ముందుగా నవంబరు 30వ తేదీనే ప్రభుత్వం పింఛన్‌ల పంపిణీకి ఆదేశాలు జారీ చేయటం జరిగిందన్నారు. ఇప్పటికే ఆయా బ్యాంకుల్లో పింఛన్‌లకు సంబంధించిన నగదు కూడా డ్రా చేయటం జరిగిందని, గ్రామ సచివాలయ సిబ్బందితో శనివారం తెల్లవారుజాము నుంచే పంపిణీ చేయటం జరుగుతుందన్నారు.

● దుర్గి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ వేగవంతంగా అందించాలని ఎంపీడీవో శివప్రసాద్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్ర వారం సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. డిసెంబరు 1వ తేదీ ఆదివారం కావడంతో ఈ నెల 30నే పూర్తిస్థాయిలో పింఛన్లు అందించాలన్నారు. స్కిల్ సర్వేను వేగవంతం చేయాలని అన్నారు. సమావేశంలో ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగం

నకరికల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులో కగ్గా పద్మావతి వరి పొలంలో పంట కోత ప్రయోగాన్ని నిర్వహించారు. ఎకరానికి 32 నుంచి 33 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. కార్యక్రమంలో ఏడీఏ బీ.శ్రీకృష్ణదేవరాయలు, ఏవో కే.దేవదాసు, సుభాని, వై.ప్రభాకర్ పాల్గొన్నారు.

జీవామృతం వల్ల ప్రజలకు ఆరోగ్యం : ఏవో

ముప్పాళ్ళ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : జీవామృతం వాడి పంటలను సాగు చేయటం వల్ల ప్రజలకు ఆరోగ్యంగా ఉంటుందని ఏవో సుజాత అన్నారు. గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమంలో భాగంగా చాగంటి వారిపాలెంలో జీవామృతం తయారీ, వినియోగంపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినులు రైతులకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల విద్యార్థినులు జీవామృతం తయారీకి కావాల్సిన పదార్థాలను వివరించారు. ఈ కార్య క్రమంలో కవిత, డాక్టర్ జీ.రమేష్, డాక్టర్ సీ. సంధ్యారాణి, రైతులు దివ్య నాగమణి, బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలి

అచ్చంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రతి నెల ఏదో ఒక గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఉమ్మడి జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ మల్లెల చిన్నప్ప, అచ్చంపేట మండల కో-ఆర్డినేటర్ సందెపోగు అశోక్ తెలిపారు. దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ జీ.శ్రీనివాసరావుకు వినతిపత్రం అందించారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో తహ సీల్దార్ అధ్యక్షతన ప్రతి నెల పౌర హక్కుల దినోత్సవం ఏర్పాటు చేయాలని తెలిపారన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

మాచవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ప్రభుత్వ పథకాలపై గుంటూరుకి చెందిన మిరియాల శివ ప్రసాదు కల్చరల్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి కళాజాత రూపంలో హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు వివరించారు. పిల్లుట్ల, వేమవరం, మాచవరం గ్రామాల్లో కళాజాత ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

జాజికి గ్రీన్ ఛాంపియన్ అవార్డు



అంకారావు (ఫైల్)

కారంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కారంపూడికి చెందిన పర్యావరణ వేత్త కొమెర అంకారావు (జాజి)కి రాజస్థాన్ రాష్ట్రం గ్రీన్ ఛాంపియన్ అవార్డు ప్రకటించింది. నల్లమల అటవీ ప్రాంతంలో పర్యావరణాన్ని కాపాడుతూ పక్షులకు ఆహారం అందించడానికి తన సొంత పొలంలో ఆహార ధాన్యాలను పండించి వాటి ఆకలి తీరుస్తున్న అంకారావు అడవి బిడ్డగా పేరొందారు. అంకారావుకు గ్రీన్ ఛాంపియన్ అవార్డు ప్రకటించడంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తూతూ మంత్రంగా సామాజిక తనిఖీ ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు, ఖాళీగా ఉన్న కుర్చీలు

గురజాలటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ ప్రజావేదికలో డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి విజయ, ఎంపీడీవో గౌసియాబేగం, ఏపీడీ మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ నెల 20 నుంచి 28వ తేదీ వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి 2024 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో ఏయే పనులు చేపట్టారు అనే దానిపై నివేదిక తయారు చేశారు. మొత్తం 171 పనులకు గాను రూ. 6,07,61,268 మంజూరయ్యాయి. కాగా, గ్రామాల వారీగా పీడీ తనిఖీ నిర్వహించగా ప్రతి గ్రామంలో సంతకాలు లేకుండా బిల్లులు తీసుకోవడం, ఉన్నది లేనట్లుగా.. లేనిది ఉన్నట్లుగా అన్నీ తప్పుల తడకలే. ఈ వర్కులు మొత్త గతేడాది వైసీపీ హయాంలో జరిగినవి. ఇప్పుడు అడిగే వారు, అడ్డొచ్చే వారు లేనట్టుగా ఇష్టానుసారంగా చేశారు. మండలంలోని పులిపాడుకు చెందిన అంగన్వాడీ టీచర్ దానకుమారి 31 రోజులు ఉపాధి పనులకు వచ్చినట్లు చూపి ఆమె ఖాతాలో డబ్బులు వేశారు. అలాగే, అదే గ్రామంలో వీఆర్ఏ ప్రసాద్ కూడా ఉపాధి పనులకు వెళ్లినట్లు డబ్బులు డ్రా చేశారు బోదవాడ, తేలుకుట్ల గ్రామాల్లో ఇద్దరు వాలంటీర్లకు కూడా డబ్బులు జమ అయ్యాయి. మాడుగులలో బోడపాటి పేరమ్మ 2019లో చనిపోయింది. ఆరేళ్ల క్రితం ఆమె ఖాతాలో కూడా డబ్బులు జమయ్యాయి. ప్రజావేదికకు ప్రజలు సరిగా హాజరుకాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తున్నాయి.

సామాజిక తనిఖీ అధికారులకు లంచాలు?

సామాజిక తనిఖీలు నిర్వహించిన అధికారులకు ఎక్కువ మొత్తంలో రికవరీ చేయకుండా ఉండడానికి పెద్ద మొత్తంలో లంచాలు ఇచ్చినట్లు సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో గ్రామాల్లో ఉపాధి హామీ కింద చేపట్టిన పనులు, వాటి వివరాలు బయటకు రాకుండా ఉండేందుకు గ్రామసభలు తూతూ మంత్రంగా నిర్వహించినట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సోలార్ పవర్ ప్లాంట్‌కు భూముల పరిశీలన



సత్రశాలలోని భూములను పరిశీలిస్తున్న జిల్లా సర్వే అసిస్టెంట్ డైరక్టర్ భాను కీర్తి తదితరులు

రెంటచింతల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు జిల్లా సర్వే అసిస్టెంట్ డైరక్టర్ భాను కీర్తి శుక్రవారం సత్రశాల భూములను పరిశీలించారు. 883 సర్వే నెంబర్‌లో 112 ఎకరాలుండగా అందులో 100 ఎకరాల్లో ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నారు. నిర్ణయించిన భూమి హద్దులను, ఇప్పుడున్న పవర్ హౌస్‌కు ఎంత దూరంలో వున్నది, భూమికి సంబంధించిన మార్కెట్ ధర ఎంత ఉందనే విషయాలపై కింది స్థాయి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సర్వే కార్యక్రమంలో ఎస్ఈ కె.వెంకటరమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వల్లా రామకృష్ణ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వెంకటేశ్వరరావు, వి.శ్రీనివాసరావు, మండల సర్వేయర్లు వి.ప్రసాదరావు, అర్జున్, రవీంద్రారెడ్డి, సైదావలి, ఈఈ సుబ్రహ్మణ్యం, నాగారాజు, ఏడీఈ రత్తయ్య, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

దళితుల స్థితిగతులను అధ్యయనం చేసే అధికారం కమిషన్‌కు లేదు

● నియోజకవర్గ మాల మహానాడు ఇన్‌చార్జ్ పద్మారావు

సత్తెనపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దళితుల స్థితిగతులను అధ్యయనం చేసే అధికారం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్‌కు లేదని నియోజకవర్గ మాల మహానాడు ఇన్‌చార్జ్ మాలే పద్మారావు అన్నారు. మాల మహానాడు ముఖ్య నాయకుల సమావేశం శుక్రవారం పట్టణ అధ్యక్షుడు కూచిపూడి జాన్‌బాబు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో పాల్గొన్న పద్మారావు మాట్లాడుతూ రాష్ట్రంలో మాల, మాదిగలను విడగొట్టే ఆలోచన ప్రభుత్వాలు చేయటం చాలా దారుణమన్నారు. ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలియజేసిన రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ మాలలు వ్యతిరేకిస్తున్నారన్నారు. ఎస్సీ వర్గీకరణ అంశంతో రిజర్వేషన్ ఎత్తి వేసేందుకు కేంద్రం కుట్ర జరుగుతుందన్నారు. మాలలతో పాటు మాదిగలు ఈ విషయాన్ని గుర్తించాలన్నారు. సమావేశంలో దాసరి జాన్‌రాజ్ పాల్, కోడిరెక్క దేవదాసు, గంజిమాల రాజారావు, ఎం.మరియదాసు, జూపల్లి స్వామి, ఎం.మహేష్ పాల్గొన్నారు.

వాయుగుండంతో రైతుల్లో ఆందోళన

రెంటచింతల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తుఫాన్‌గా మారే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరిక రైతుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది. పంట చేతికందే సమయంలో వర్షాలు కురిస్తే ఆరబోసిన ధాన్యం తడిసిపోతుందని, మరో వైపు కోతకొచ్చిన వరి నేల వాలుతుందనే ఆందోళన వ్యక్తమౌతుంది. వాయుగుండం ప్రభావంతో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కోతలు వాయిదా వేయాలని ఏవో బ్రహ్మారెడ్డి సూచించారు.

పట్టపగలు ఫ్యాన్సీ దుకాణంలో చోరీ

● రూ.1.55 లక్షల నగదు అపహరణ

కారంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టపగలు ఓ ఫ్యాన్సీ దుకాణంలో చోరీ జరిగిన సంఘటన కారంపూడిలో శుక్రవారం జరిగింది. గాంధీబొమ్మ సెంటర్లోని ఓ ఫ్యాన్సీ దుకాణంలో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు షాపులోని రూ.1.55 లక్షలను అపహరించినట్లు దుకాణం యజమాని మురళి తెలిపారు. బ్యాంకులో బంగారం రుణం కట్టడానికి డబ్బు మొత్తాన్ని లాకరులో పెట్టి భోజనానికి వెళ్లి వచ్చేసరికి చోరీ జరిగిందన్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ వాసు సంఘటనా ప్రదేశాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి మెడలో బంగారు గొలుసు...

సత్తెనపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇంటిలో ఒంటరిగా ఉన్న వృద్ధుడి మెడలో బంగారు గొలుసును దొంగ తెంపుకెళ్ళిన సంఘటన శుక్రవారం రాత్రి అచ్చంపేట రోడ్డులో జరిగింది. పట్టణ పోలీసుల కథనం మేరకు అచ్చంపేట రోడ్డులో నివశిస్తున్న దేవకి గోపాళరావు ఇంటికి గుర్తు తెలియని యువకుడు అగ్గిపెట్టె కావాలని వచ్చి అతని మెడలో ఉన్న రెండున్నర లక్షల విలువైన 20 గ్రాముల బంగారు గొలుసును తెంపుకుని పరారయ్యాడు. ఇంటిలో గోపాళరావు ఒక్కడు మాత్రమే ఉండటంతో ఆయన బయటకు వచ్చి కేకలు వేశాడు. అప్పటికే దొంగ పరారయ్యాడు. స్థానికుల సహకారంతో ఆయన పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. గోపాళరావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మృతదేహం ఆచూకీ లభ్యం

అమరావతి, నవంబరు 29(ఆంధ్రజ్యోతి) : కృష్ణానదిలో గురువారం లభ్యమైన మహిళ మృతదేహం ఆచూకీ తెలిసింది. సత్తెనపల్లికి చెందిన జంపాల వెంకటరమణయ్య భార్య లీలావతిగా పోలీసులు గుర్తించారు. లీలావతికి రెండు సంవత్సరాలుగా మానసిక పరిస్థితి సక్రమంగా లేకపోవడంతో ఆమెకు వైద్య సేవలు అందిస్తున్నారు. భర్త వెంకట రమణయ్య నర్సాపురంలోని తన తమ్ముడు ఇంటికి వెళ్లాడు. కుమారుడు హరీష్ ఉదయాన్నే హోటల్‌లో పనికి వెళ్లగా లీలావతి ఇంటిలో నుంచి బయటకు రావడం జరిగింది. ప్రతిరోజు వారు బయటకు వెళ్లేటప్పుడు లీలావతిని ఇంటిలో ఉంచి తలుపులు వేసి వెళ్లేవారు. గురువారం మాత్రం హరీష్ తలుపు వేయకుండా వెళ్లడంతో ఆమె బయటకు వెళ్లిపోయింది. హరీష్ మధ్యాహ్నం భోజనానికి ఇంటికి వచ్చే సరికి తల్లి లేకపోవడంతో చుట్టుపక్కల వెతికి ప్రయోజనం లేక సత్తెనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం పత్రికలలో గుర్తు తెలియని మహిళ మృతదేహం కథనం రావడంతో వారు అమరావతి చేరుకున్నారు. లీలావతిగా నిర్ధారించిన అనంతరం పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

దాచేపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): దాచేపల్లి నగర పంచాయతీ పరిధిలోని నడికూడి గ్రామ సమీపంలో ఉన్న అమరలింగేశ్వర కోల్డ్ స్టోరేజ్ వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.12 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి ఎస్ఐ పాపారావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మండలంలో టీడీపీ సభ్యత్వ నమోదు

నకరికల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లులో శుక్రవారం టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ అలీ బాషా సభ్యత్వ నమోదును చేశారు. కార్యక్రమంలో బత్తెన గంగయ్య, ఇర్ల నాగభూషణం, నాగరాజు, వీవీ గురువులు, ఖాశిం, ఖాదర్, నాగూర్, మస్తాన్‌లు పాల్గొన్నారు. కాగా కుంకలగుంట శివారు పాపిశెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం రాత్రి టీడీపీ యువ నేత డాక్టర్ సింగరాజు సాయి కృష్ణ టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. చంద్రబాబు నాయకత్వంలో మంచి పాలన అందిస్తున్న ప్రభుత్వానికి ప్రతి ఒక్కరు సభ్యత్వం తీసుకొని టీడీపీని బలపరచాలని సాయికృష్ణ కోరారు. ఈ కార్యక్రమంలో ఆవుల సుబ్బయ్య, రామిశెట్టి హనుమంతరావు, పాపిశెట్టిపాలేనికి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జానపాడులో కార్తీక వనభోజనాలు



కార్యక్రమంలో పాల్గొన్న నిఖిల్ తదితరులు

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): జానపాడు గ్రామ కాకతీయ కమ్మ వనభోజనాల కార్యక్రమం శుక్రవారం జానపాడు గ్రామంలో జరిగింది. అమ్మవారి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాలలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు నిఖిల్ పాల్గొన్నారు. సమావేశంలో నిఖిల్ మాట్లాడుతూ సామాజిక వనభోజనాల కార్యక్రమాలతో సామాజిక ఐక్యత పెరుగుతుందన్నారు. డాక్టర్ వున్నం నాగమల్లికార్జునరావు, వున్నం సురేష్, చింతలపూడి రామ్మూర్తి, బండ్ల వెంకటేష్, వున్నం వెంకట్రావు, ముప్పాళ్ల సాంబయ్య, వున్నం శ్రీను (కోటా శ్రీను), కూరపాటి కొండలరావు, వున్నం శ్రీను (పాల శ్రీను), కూరపాటి పకీరయ్య, రాయపాటి ఆదయ్య, వున్నం నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

భోళాలింగేశ్వరస్వామి ఆలయంలో కుంకుమపూజలు



అయిదు కోట్ల ఒత్తులు వెలిగించిన భక్తులు

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ భోళాలింగేశ్వరస్వామి దేవాలయం 18వ వార్షికోత్సవం, కార్తీక మాసశివరాత్రి సందర్భంగా 5 కోట్ల ఒత్తుల కార్యక్రమం, స్వామి వారికి లక్ష బిల్వార్చన, కుంకుమ పూజ కార్యక్రమాలు శుక్రవారం దేవాలయంలో వైభవంగా జరిగాయి. స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష కుంకుమార్చన అనంతరం లక్ష బిల్వార్చన కార్యక్రమాలలో పట్టణంలోని భక్తులు విశేషంగా పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ భక్తులకు మహాఅన్నదానం కార్యక్రమం చేపట్టారు.



నరసింగపాడు గంగా అన్నపూర్ణాదేవి

● నకరికల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నరసింగపాడులో ఉన్న గంగా అన్న పూర్ణా సమేత మరకత లింగ చంద్రమౌళేశ్వర స్వామి దేవాలయంలో లక్ష బిల్వార్చన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామి వారిని, గంగా అన్నపూర్ణాదేవిని విశేషంగా అలంకరించారు. పూజలను ఆలయ ధర్మకర్త పమిడిమర్రి శ్రీనివాసశర్మ పర్యవేక్షించగా టి.శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు పాల్గొన్నారు.

● క్రోసూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : కార్తీక మాసంలో చివరి శుక్రవారం, మాస శివరాత్రి వేడుకలు క్రోసూరు మండలంలోని వివిధ శివాలయాల్లో ఘనంగా నిర్వహించారు. పీసపాడులోని పురాతన నాగమల్లేశ్వర స్వామి దేవాలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. క్రోసూరులోని కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయంలో రుద్రాభిషేకం, ఘటాభిషేకం, మహన్యాసం తదితర కార్యక్రమాలు కన్నుల పండువగా జరిగాయి. వివిధ శివాలయాల్లో భక్తులు ప్రమిదలు వెలిగించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

● మాచవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కార్తీక మాస పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మాచవరం చెన్నమల్లేశ్వర స్వామి దేవాలయం, వంకాయల మల్లయ్య దేవాలయం, మోర్జంపాడు శివారు బుగ్గమల్లేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అభిషేకాలు నిర్వహించారు. మాచవరం శివాలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

మాచవరంలో ఆధార్ సేవలు ప్రారంభం

మాచవరం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : రెండు విడతలుగా పలు గ్రామాల్లో నిర్వహించిన ఆధార్ కేంద్రాల ద్వారా సుమారు 170 మందికి ఆధార్ సేవలు నిర్వహించటం జరిగిందని ఎంపీడీవో పీ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. ఆధార్ కార్డులో చేర్పులు, మార్పులు, పుట్టి తేదీ, అడ్రస్, ఆధార్ అప్‌డేట్ తదితర సమస్యలను సుమారు 170 మందికి పైగా పరిష్కరించటం జరిగిందని ఎంపీడీవో తెలిపారు.

విద్యార్థులకు ఆరోగ్య సర్వే

బెల్లంకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ జిల్లా పరిషత్ పాఠశాలలో శుక్రవారం చంద్రాజుపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు ఆరోగ్య సర్వే నిర్వహించారు. ఈనెల 30వ తేదీ లోగా ఆరోగ్య సర్వే పూర్తి చేసి తుది నివేదికను ఉన్నతాధికారులకు సిఫార్స్ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వాణి, సూపర్ వైజర్ బాషా, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జామ తోటను ధ్వంసం చేసిన దుండగులు

నకరికల్లు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : నకరికల్లు శివారు శ్రీరామ్‌పురంనకు చెందిన పేరం వెంకటేశ్వరెడ్డి అనే రైతు శివాపురం తండాలో తనకు ఉన్న పొలంలో రెండున్నర ఎకరాల్లో జామ తోటను సాగు చేసుకున్నాడు. మొక్కల కొనుగోలుకు, రవాణాకు, ఎరువులకు, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు, వ్యవసాయ కూలీలకు రూ.4 లక్షలు మేర ఖర్చు పెట్టాడు. గురువారం రాత్రి పొలం పనులు చూసుకొని ఇంటికి వచ్చాడు. శుక్రవారం ఉదయం పొలానికి వెళ్ళి చూసే సరికి జామ మొక్కలు పీకి వేరే ప్రదేశంలో పడవేసి ఉండటాన్ని గుర్తించాడు. తనకు నష్టం కలిగించేలా వ్యవహరించే వారిని గుర్తించి తనకు తగు న్యాయం చేయాలని బాధిత రైతు వెంకటేశ్వరరెడ్డి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు పొలానికి వెళ్ళి వివరాలను సేకరించారు.

మెగా పేరెంట్స్ సమావేశంపై సమీక్ష

పిడుగురాళ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7వ తేదీన జరిగే మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని విజయవంతమయ్యేలా చూడాలని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. శుక్రవారం అన్ని మండలాల విద్యా శాఖ అధికారులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అపార్ కార్డులు, మెగా పేరెంట్స్ సమావేశం, యుడైస్, పాఠశాలల తనిఖీ, హాజరుపట్టికతో పాటు పలు అంశాలపై జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారులు శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు, పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

నేడు పిడుగురాళ్లలో రైల్వేగేటు మూసివేత

గుంటూరు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అత్యవసర మరమ్మతులు కారణంగా న్యూపిడుగురాళ్ల - పిడుగురాళ్ల మధ్యన ఉన్న రైల్వేగేటు నంబరు.60ని శనివారం మూసి వేస్తున్నట్లు డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈ గేటు మూసి ఉంటుందన్నారు.



రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన మన్నవ మోహనకృష్ణను ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
- సత్తెనపల్లి (ఆంధ్రజ్యోతి)

కన్నాను కలిసిన ఆర్యవైశ్యనేతలు

సత్తెనపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం నూతన కమిటీ అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులు శుక్రవారం సాయంత్రం పట్టణంలోని రఘురాం నగర్‌లో గల కన్నా లక్ష్మీనారాయణ కార్యాలయంలో ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు కన్నా లక్ష్మీ నారాయణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో సంఘం అధ్యక్షుల సేవలు ప్రసంసనీయం అన్నారు. సంఘ అభివృద్ధికి అందరూ కృషి చేసి మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చు వెంకటేశ్వర్లు, టి.కాశీమల్లేశ్వరరావు, బి సత్యనారాయణ, కొల్లిపర కాశీ విశ్వనాథం, ఆతుకూరి నాగేశ్వరరావు, చౌటా శ్రీనివాసరావు, కొత్తా లక్ష్మయ్య, పోతుగంటి రామకోటేశ్వరరావు, దివ్వెల శ్రీనివాసరావు తదితరలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణతో ఆర్యవైశ్య నేతలు

నాగేంద్రమ్మకు నివాళులు

సత్తెనపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుడిపూడికి చెందిన టీడీపీ నేత లగడపాటి గజానన మాతృమూర్తి నాగేంద్రమ్మ శుక్రవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ కోడెల శివరామ్, ఎలినేడి రామస్వామి, సత్తెనపల్లి నియోజకవర్గ పలువురు టీడీపీ నేతలు నాగేంద్రమ్మ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గజానను పరామర్శించి సానుభూతి తెలిపారు.

టీడీపీ కార్యకర్త ఇబ్రహీంకు నివాళులు

సత్తెనపల్లి నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 27వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త సయ్యద్ ఇబ్రహీం దశదిన కర్మలో శుక్రవారం ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొని ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన వెంట పలువురు టీడీపీ నేతలు ఉన్నారు.

టీడీపీ నేతకు కోడెల శివరామ్ పరామర్శ

సత్తెనపల్లి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెండవ వార్డుకు చెందిన టీడీపీ నేత పసుపులేటి లింగేశ్వరరావు భార్య దశ దిన కర్మలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోడెల శివరామ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు. లింగేశ్వరరావును పరామర్శించారు.

నూజివీడు సీడ్స్ పుష్ప పత్తి క్షేత్ర ప్రదర్శన



పత్తి పంటను పరిశీలిస్తున్న రైతులు

అమరావతి, నవంబరు 29 (ఆంధ్ర జ్యోతి) నూజివీడు సీడ్స్ కంపెనీ అందించిన పుష్ప (ఎన్‌సీఎస్ 1012) రకం పత్తిలో అధిక దిగుబడి సాధిస్తుందని కంపెనీ ఆర్ఎం సీహెచ్ భాస్కర్ అన్నారు. మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో రైతు సాయిరామ్ సాగు చేసిన పుష్ప పత్తి పంటలో శుక్రవారం క్షేత్రప్రదర్శన నిర్వహించారు. రైతు సాయిరామ్ మాట్లాడుతూ పుష్ప పత్తి మొక్కలు పురుగు తాకిడిని తట్టుకుని వాతావరణ పరిస్థితులను తట్టుకుని అధిక దిగుబడి వస్తుందని అన్నారు. ఎకరాకు సుమారు 18 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందన్నారు. ఆర్ఎం భాస్కర్ మాట్లాడుతూ నూజివీడు సీడ్స్ కంపెనీ స్థాపించి 50 సంవత్సరాలు అవుతుందని, రైతుల నమ్మకానికి అనుగుణంగా వివిధ రకాల పంటల విత్తనాలను అందిస్తుందన్నారు. డీఆర్ఎం వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పుష్ప పత్తి త్వరగా కాపురావడం, నూగు ఉండటం వలన చీడపీడల నుంచి తట్టుకుంటుందన్నారు. క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్న రైతులు పంట దిగుబడి బాగుందని తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు ఎం.ఏసుబాబు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికి గుర్తింపు

● మద్దిరాల గంగాధర్




గంగాధర్‌ను సన్మానిస్తున్న మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు


అచ్చంపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీలో కష్టపడే వారికి తప్పకుండా గుర్తింపు వస్తుందని ఆంధ్రప్రదేశ్ నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్ అన్నారు. నీలేశ్వరపాలెంలోని నీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద అచ్చంపేట మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు శుక్రవారం గంగాధర్‌ను ఘనంగా సత్కరించారు. గంగాధర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచిందని, టీడీపీ అంటేనే బీసీల పార్టీ అన్నారు. బీసీల అణచివేతే జగన్‌రెడ్డి పాలనగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఆదరణ పథకాన్ని రద్దు చేసి పరికరాలు తుప్పు పట్టేలా చేశారని విమర్శించారు. బీసీలకు విదేశీ విద్య, పెళ్ళి కానుకలు రద్దు చేశారని, బీసీ భవనాలను కూడా జగన్‌మోహన్‌రెడ్డి నిలుపుదల చేశాడని విమర్శించారు. బీసీల బాంధవుడు చంద్రబాబు మాత్రమేనన్నారు. గంగాధర్‌ను సన్మానించిన వారిలో అచ్చంపేట మండల నాయీబ్రాహ్మణ సేవా సంఘం నాయకులు రామ్మూర్తి, ఎన్ నరేంద్ర, టీ రంగారావు, ఎం సాంబశివరావు, ఏడుకొండలు తదితరులు ఉన్నారు.

పల్నాడులో జైనం ఉనికి

పల్నాటి గడ్డ.. పగ, ప్రతీకారాలకు, పల్నాటి వీరుల పౌరుష పరాక్రమాలకే కాదు.. ఒకప్పుడు శాంతి, అహింసను బోధించి అనుసరించిన గొప్ప జ్ఞానభూమి కూడా. ఎందుకంటే, పల్నాడులో జైన మతం భాసిల్లిందని చెప్పడానికిఇందుకు సంబంధించిన ఆధారాలు ఉన్నాయి. మాచర్ల పట్టణంలో జైనమతం ఉనికిని తెలిపే విగ్రహాలు గుర్తింపులోకి వచ్చాయి.

- తీర్థంకరుల విగ్రహాలు
- పాతమాచర్లలో పార్శ్వనాథుడు విగ్రహం
- నాగబుద్ధుని శివాలయంలో సుపార్శ్వనాథుడు





మాచర్లటౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పాత మాచర్లలోని వీరశైవ మతానికి చెందిన కంభాలమఠం వారి సమాధుల దొడ్డిలో సమాధుల మధ్యలో ఉన్న జైన తీర్థంకరులలో ఒకరైన 23వ తీర్థంకరుడు పార్శ్వనాథుడు విగ్రహం ఉంది. నాలుగు అడుగుల ఎత్తులో ఉన్న ఈ నల్లరాతి విగ్రహంపై అద్భుతమైన శిల్పకళ ఉంది. ఏడు పడగల నాగుపాము పడగ నీడలో దిగంబరుడిగా, కాయత్సర్గ భంగిమ (నిలబడి)లో ఉన్న పార్శ్వనాథుడు ధ్యానము ద్రలో ఉన్నారు. ఆపైన మూడు పొరల (త్రిస్తర) ఛత్రాలు ఉన్నాయి. పాదాల వద్ద యక్ష, యక్షణీయులు ఉన్నారు. ఈ తీరు శిల్పాన్ని చౌనీసి విగ్రహం అంటారు. ఈ చిత్రాలన్నీ అందంగా చెక్కబడి ఉన్నాయి.



కంభాలమఠం సమాధుల దొడ్డిలో పార్శ్వనాథుని విగ్రహం

పోతురాజుగా పూజలందుకుంటున్న తీర్థంకరుడు

పాత మాచర్ల నాగిరెడ్డి బజారులోని పోలేరమ్మ దేవాలయం చాలా పురాతనమైంది. ఈ ఆలయంలో క్రీస్తు శకం 1313 నాటి కాకతీయ దాన శాసనం ఉంది. ఈ దేవాలయం గర్భగుడి ఎదురు ఒక రాతిపై నాలుగు వైపులా కాయత్సర్గ భంగిమలో దిగంబరంగా ఉన్న తీర్థంకరుడి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. ఈ తీర్థంకరుడి విగ్రహాన్ని స్థానికులు పోతురాజుగా బావించి పూజలు చేస్తున్నారు. అయితే, ఈ విగ్రహం పోతురాజుది కాదు. జైన తీర్థంకరులలో ఒకరిది. అక్కడ జైన పాదాల ముద్రలు కూడా ఉన్నాయి.

జైనం.. ప్రస్థానం

క్రీస్తు పూర్వం ఆరో శతాబ్దంలో జైనమతం పుట్టింది. జీనడు అంటే అన్నింటిని జయించిన వాడు అని అర్థం. మతాన్ని ప్రచారం చేసే వారిని తీర్థంకరులు (మార్గదర్శకులు, శాస్త్రము నిర్మించిన వాడు) అని అంటారు. కళింగ రాజు అయిన ఖరవేలుడి ఆదరణ వలన కృష్ణా నదికి ఉత్తర తీర ప్రాంతాల్లో ముందంజ వేసింది. అశోకుడి పుత్రుడు సంప్రతి ఆంధ్ర, ద్రవిడ దేశాల్లో జైనం వ్యాప్తికి కృషి చేశారు. అమరావతి సమీపంలోని వడ్డమాను కొండపై సంప్రతి విహారం ఏర్పడింది. అక్కడ ఖరవేలుడు మహా మేఘ వాహన విహారం నిర్మించాడని తెలుస్తోంది. చంద్రగుప్తులు, శాతవాహన కాలంలో ఈ ప్రాంతంలో జైన మత ప్రచారం జరిగినట్లు పరిశోధకుల అభిప్రాయం. ఆ తరువాత రాష్ట్రకూటులు, చాళుక్యులు, కాకతీయ గణపతి దేవుని వరకు జైనమతం ఉందని తెలుస్తోంది. అనంతరం వీరశైవం, వీర వైష్ణవం కారణంగా కొన్ని జైనాలయాలు ధ్వంసం చేయబడి వాటిని శివాలయాలుగా, వైష్ణవాలయాలుగా మార్చి వేయడం జరిగింది. అలాగే, పల్నాడు ప్రాంతంలో మాచర్లలోని క్రీస్తుశకం 641వ సంవత్సరం శాసనం ప్రకారం, మరికొన్ని శాసనాల్లో 'పల్లినాటి', 'పల్లినాంటి వీరుడు' అని ఉందని, 'పల్లి' అంటే జైన బసదులని, ఆ కాలంలో జైన, బౌద్ధ ఆరామాలు ఎక్కువగా ఉండడం వలన పల్లినాడు అన్నారని చరిత్ర కారుల భావన.

నాగమయ్య కాదు సుపార్శ్వనాథుడు

మాచర్ల రింగు రోడ్డు నుంచి సాగర్ రహదారిలో ప్రభుత్వ కళాశాలకు వెళ్లే రహదారికి ఎదురుగా ఉన్న నాగబుద్ధుని శివాలయంలో పూజలందుకుంటున్న నాగమయ్య (నాగబుద్ధుడు) జైన తీర్థంకరులలో ఏడో తీర్థంకరులైన సుపార్శ్వనాథుడు. దేవాలయంలో మూడు రాతి స్తంభాలు ఉన్నాయి. వాటిలో ఐదు పడగల నాగుపాము నీడలో కాయత్సర్గ భంగిమలో ఉన్న సుపార్శ్వనాథుడి చిత్రాలు చెక్కబడి ఉన్నాయి. రెండు రాతి స్తంభాలపై ముందుభాగంలో, మధ్య స్తంభం ముందు, వెనుక భాగాల్లో ఈ చిత్రాలు ఉన్నాయి.

జైన బసది..

మాచర్ల మున్సిపల్ రిజర్వాయర్ పక్కన ఉన్న ఎస్సీ హాస్టల్ ఆవరణలో శిథిల కట్టడం జైన బసది. అయితే, ప్రస్తుతం దానిని బాగు చేయించి శివాలయంగా మార్చారు. పన్నెండళ్ల క్రితం శిథిలావస్థలో ఈ జైన బసది ఉండేది. దీనిలో కొందరు గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపి ధ్వంసం చేశారు. 2015లో దీన్ని బాగు చేయించి శివాలయంగా మార్చారు. జైనులు ధ్యానం చేసుకోవడానికి జైన బసదులు ఉపయోగించే వారు.



చెన్నకేశవ ఆలయం జైనాలయమా?

ప్రసిద్ధ మాచర్ల చెన్నకేశవస్వామి ఆలయం పూర్వం జైనుల లయం కావొచ్చని పలువురు పరిశోధకుల అభిప్రాయం. 12వ శతాబ్దంలో శివాలయం చెన్నకేశవ ఆలయంగా మార్చబడిందని ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ దేవాలయం ముందు పెట్టిన బోర్డులో ఉంది. అయితే, జైనాలయం శివాలయంగా మారి ఆ తర్వాత చెన్నకేశవ ఆలయంగా మార్పు చెంది ఉండవచ్చని పలువురు చరిత్రకారుల అభిప్రాయం. అయితే, దీనిని నిరూపించే ఆధారాలు మాత్రం లేవు.



పోలేరమ్మ దేవాలయంలో తీర్థంకరుడి విగ్రహం

పార్శ్వనాథుని విగ్రహాన్ని పరిరక్షించాలి

మాచర్ల పట్టణంలో బయటపడిన ఈ జైన విగ్రహాలు శాసనాలు లేనందున ఏ కాలం నాటివో చెప్పడం కష్టం. వీటిని పురావస్తు శిలాతత్వ శాఖ వారు పరీక్షించి కాలం నిర్ణయించాల్సిందే. పార్శ్వనాథుని విగ్రహాన్ని ప్రభుత్వం పరిరక్షించాలి. జైన మతానికి సంబంధించిన ఇక్కడి అపురూప విగ్రహాలను పరిరక్షించడానికి పురావస్తు శాఖ దృష్టి సారించాలి.

ఎస్సీ మహిళల పరిశ్రమలకు

రూ.50 వేలు రాయితీ

- రూ. 1.64 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం
- డిసెంబరు 2 వరకు దరఖాస్తుకు అవకాశం
- డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ



గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని డ్వాక్రా సంఘాల్లో సభ్యులుగా ఉన్న ఎస్సీ మహిళలకు ఉన్నతి పథకం కింద స్వయం ఉపాధి యూనిట్లు ఏర్పాటు చేసుకునే వారికి ప్రభుత్వం ఆర్థికంగా చేయూత నిస్తున్నట్లు డీ డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మీ వెల్లడించారు. ఎస్సీ మహిళలు ఏర్పాటు చేసుకునే సూక్ష్మ, మధ్యతరహా యూనిట్లకు ప్రభుత్వం రూ.50 వేల వరకు రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు రుణాలు పొందిన మహిళలకు ఈ రాయితీ వర్తిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 20868 డ్వాక్రా సంఘాలు ఉండగా, వారిలో ఎస్సీ సంఘాలు 6,556 ఉన్నాయని తెలిపారు. జిల్లాకు మొదటి విడతగా 82 యూనిట్లకు గాను రూ.1.64 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, డ్వాక్రా సంఘాల్లో ని 18- 60 ఏళ్ళలోపు వయస్సు ఉన్న ఎస్సీ మహిళలకు ఈ పథకాన్ని వర్తింపజేయనున్నట్లు వెల్లడించారు. రాయితీ కోసం డిసెంబరు 2న ఐదు గంటల లోపు స్థానిక వెలుగు కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని పీడీ విజయలక్ష్మీ సూచించారు.

నేటి నుంచి రాష్ట్ర సదస్సు

- హాజరుకానున్న 600 మంది చర్మవ్యాధుల వైద్య నిపుణులు
- ఐఏ డీవీఎల్ రాష్ట్ర అధ్యక్షురాలు కవిత వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు, సీతారామ్, కవిత, సౌజన్య

గుంటూరు మెడికల్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజీ, వెనీరియాలజీ, లెప్రాలజీ (ఐఏ డీవీఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ 43వ వార్షిక వైద్య సదస్సు 'ఏపీ క్యుటికాన్ 2024' ఈ నెల30, డిసెంబర్ 1 తేదీల్లో గుంటూరులో జరుగుతున్నట్లు ఏపీ చర్మ వ్యాధుల వైద్య నిపుణుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత తెలిపారు. శుక్రవారం లక్ష్మీపురంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్‌లో గల శ్రీ కన్వెన్షన్‌లో శని, ఆదివా రాల్లో జరిగే ఈ వైద్య సదస్సుకు రాష్ట్రవ్యాప్తంగా 600 మంది వైద్యులు, పీజీ మెడికల్ విద్యార్థులు హాజరవుతున్నట్లు డాక్టర్ కవిత వివరించారు. ఐఏ డీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షినాయ్ సదస్సును ప్రారంభిస్తారన్నారు. సైంటిఫిక్ కమిటీ ఛైర్మన్ డాక్టర్ కేపీ సీతారామ్ మాట్లాడుతూ సదస్సులో చర్మ వ్యాధులతో పాటు కుష్టు, లైంగిక వ్యాధులు, జుత్తు సమస్యలు, లేజర్ చికిత్సలు, సౌందర్య చర్మ చికిత్సలు, బొల్లి మచ్చలు, ఇతర పిగ్మెంటేషన్ వ్యాధులకు సంబంధించిన ఆధునిక చికిత్సలపై పలువురు వైద్యనిపుణులు ప్రసంగిస్తారని తెలిపారు. సదస్సులో 12 మంది జాతీయ ఫ్యాకల్టీ, 40 మంది ఫ్యాకల్టీ ఆయా అంశాలపై ప్రసంగిస్తారన్నారు. 30 పోస్టర్ ప్రజెంటేషన్ పేపర్లు సదస్సులో ప్రదర్శిస్తామన్నారు. సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ జే సౌజన్య మాట్లాడుతూ డిసెంబరు 1న వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ముఖ్యఅతిథులుగా ఐఏ డీవీఎల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మంజునాథ్ షినాయ్, సెక్రటరీ జనరల్ డాక్టర్ భూమేష్ కుమార్ కటకం పాల్గొంటారని తెలిపారు. విలేకర్ల సమావేశంలో కే డాక్టర్ నాగేశ్వరరావు, డాక్టర్ టీ మోహన్‌రావు పాల్గొన్నారు.



కలక్టరేట్ లోని ఈవీఎంల గోడౌన్ పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మీ

ఈవీఎంల గోడౌన్ తనిఖీ

గుంటూరు సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మాసవారి తనిఖీలలో భాగంగా శుక్రవారం గుంటూరు కలక్టరేట్ ఆవరణలోని ఈవీఎంలు భద్రపరిచిన గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మీ పరిశీలించారు. సీసీ టీవి పనితీరు, అగ్నిమాపక పరికరాలను పరిశీలించారు. గోడౌన్ వద్ద భద్రత సిబ్బంది లాగ్ బుక్‌ను పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలపై గడువు తేదీని ఎప్పటికప్పుడు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈవీఎంల భద్రత విషయంలో రాజీపడకుండా అవసరమైన అన్ని భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఫిరంగిపురం మండలం రేపూడి గ్రామంలో వ్యవసాయ మార్కెట్‌లో వీవీ పాట్స్ భద్రపరచిన గోడౌన్‌ను గుంటూరు ఆర్డీవో కే. శ్రీనివాసరావు తనిఖీ చేసి భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేటట్లు పర్యవేక్షిస్తుండాలని భద్రతా సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో షేక్. ఖజావలి, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఫిరంగిపురం తహసీల్దార్ జె. ప్రసాదరావు, గుంటూరు ఆర్అండ్‌బీ ఈ.ఈ విశ్వనాథ రెడ్డి, జిల్లా ఫైర్ ఆఫీసర్ శ్రీనివాస రెడ్డి, ఎలెక్షన్ సెక్షన్ పర్యవేక్షకులు మల్లేశ్వరి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్కంఠభరితంగా

ఆంధ్రా - ఉత్తరాఖండ్ మ్యాచ్

మంగళగిరి సిటీ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూచ్ బెహర్ అండర్-19 ట్రోఫీలో భాగంగా మంగళగిరి ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరుగుతున్న నాలుగు రోజుల మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 76 పరుగులతో బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రా జట్టు 80 ఓవర్లలో 337 పరుగులు చేసి ఆలౌటయింది. ఆంధ్రా జట్టులో కే.హనీష్ వీరారెడ్డి 6 సిక్సర్లు, 11 ఫోర్లతో 106 పరుగులు, మన్విత్‌కుమార్ రెడ్డి 55 పరుగులు సాధించారు. ఉత్తరాఖండ్ బౌలర్లు రితిక్ దూహరాన్, జతిన్‌లు చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు దిగిన ఉత్తరాఖండ్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి 33ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 137 పరుగులు చేసింది. ఉత్తరాఖండ్ బ్యాటర్ అరవ్ మహాజన్ 61 పరుగులు చేయగా, ఆంధ్రా బౌలర్లు ఎస్.రాజేష్, ఏఎస్‌వీ లోహిత్‌లు చెరో వికెట్ సాధిం చారు. ఉత్తరాఖండ్ విజయం సాధించా లంటే మరో 256 పరుగులు చేయాల్సివుంది.



హనీష్ (106 పరుగులు)



మన్విత్ (55 పరుగులు)



అరవ్ (61 పరుగులు)

నేటి నుంచి

వీరారాధనోత్సవాలు

మండల కేంద్రమైన కారంపూడిలో శనివారం నుంచి ఐదు రోజులపాటు వీరారాధన ఉత్సవాలను నిర్వహించనున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని 14 జిల్లాల వీరాచారవంతులు తమ ఆయుధాలతో యుద్ధభూమికి రానున్నారు. మొదటి రోజైన ఈనెల 30వ తేదీన రాచగావు, డిసెంబరు 1న రాయభారం, 2న మందపోరు, 3న కోడిపోరు (ప్రధానమైనరోజు), 4న కల్లిపాడు జరపనున్నారు.







కారంపూడి, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరారాధన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. అంకాళమ్మ అమ్మవారు ఆలయం, ధ్వజస్తంభం, సూరేశ్వరస్వామి ఆలయాలు బ్రహ్మనాయుడు మేడ, కన్నమదాసు మేడలను రంగులతో సుందరంగా తీర్చిదిద్దారు. ఉత్సవాలకు విచ్చేసే భక్తులకు అటువంటి అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని వసతులు సమకూర్చారు.

నేడు ఎడ్ల పోటీలు ..

వీరారాదన ఉత్సవాలను పురస్కరించుకొని పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో శనివారం తెలుగు రాష్ట్రాలస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించనున్నారు. ఈ పోటీలకు మాచర్ల శాసనసభ్యుడు జూలకంటి బ్రహ్మానందరెడ్డి స్వయంగా ప్రారంభించనున్నారు.

అంకాళమ్మ దేవాలయం

పల్నాటి యుద్ధానికి పూర్వం కార్యమపూడి అని పిలువబడే నేటి కారంపూడిలో అంకాళమ్మ, సూరేశ్వర, చెన్నకేశవస్వామి ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు నేటికీ వీరాచారవంతులు వచ్చి కొలుపులు జరుపుతుంటారు. 12వ శతాబ్దానికి ముందు నిర్మించిన అంకాళమ్మ అమ్మవారి ఆలయంలో ఎదురుగా ఉన్న నాగులేటి ఒడ్డున పల్నాటి యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో వీరు ఒక్కొక్కరుగా నేలకొరుగుతుంటే అమ్మవారి విగ్రహం నుంచి కన్నీరు కారుతుండేదట. ఆ నీరు నేలమీద పడితే అరిష్టమని అప్పటి పూజారులు కంటి కింద ఓ గిన్నెను అమర్చారు. వీరులు మరణిస్తుంటే అమ్మవారి తల వరిగిందంట. అప్పటికీ అమ్మవారి తల ఒరిగినట్లు విగ్రహం దర్శనమిస్తోంది. అంతటి మహిమాన్విత శక్తి గల అంకాళమ్మ అమ్మవారిని భక్తులు వేలాధిగా కొలుస్తుంటారు. మాలదారణ స్వీకరించి దీక్ష చేపట్టి వీరారాధన ఉత్సవాల్లో కోడి పోరు రోజున ఇరుముడులు సమర్పించి దీక్ష విరమిస్తారు. వీరాచారవంతు కత్తి సేవ చేసి అమ్మవారికి కొలుపులు జరుపుతారు. ఇప్పటికీ ఈ ప్రాంతంలో అంకమ్మ, అంకాళమ్మ, అంకారావు అనే పేర్లు అనేక మందికి ఉంటాయి. సంతానం లేని వారు అమ్మవారిని కొలిచి ఆమె పేరు పెట్టుకుంటామని మొక్కుకుంటే సంతానం కలుగుతుందని ప్రసిద్ధి. శ్రావణమాసం రెండో శుక్రవారం అమ్మవారి ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం జరపడం అనాధిగా వస్తోంది.

చెన్నకేశవస్వామి దేవాలయం

మాచర్ల రాజ్యానికి మంత్రిగా ఉన్న బ్రహ్మనాయుడు కారంపూడిలో చెన్నకేశవస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆయన కారంపూడి వచ్చినప్పుడు ఆయన మేడలో నివసిస్తూ గంగధార మడుగులో స్నానమాచరించి చెన్నకేశవస్వామిని దర్శించుకొని వెళ్లేవారట. చెన్నకేశస్వామి ఆలయంలో ముఖ మండపం ముందు ఓ బావి ఉండేది. ఆ బావిలో నీరు తాగితే ఎక్కడలేని వీరావేశం వచ్చేది. దీంతో ఆ బావిని మూసివేశారని చరిత్రకారులు తెలుపుతున్నారు. నేటికీ చెన్నకేశవుని వీరారాధన ఉత్సవాల్లో వీరాచారవంతులు పూర్వీకుల ఆయుధాలతో వచ్చి కత్తి సేవ చేసి తీర్థం పుచ్చుకుంటారు. ఆనాటి ఆలయాన్ని 2004లో దేవాదాయ శాఖ జీర్ణోద్ధరణ గావించింది.



నాగులేరు ...

వీరుల దేవాలయ సరిహద్దుల్లో నాగులేరు ఉంది. ఈ ప్రాంతంలోనే గంగధార మడుగు ఉంది. గంగధార మడుగును శ్రీనాథ మహాకవి కాశీలోని మణికర్ణికఘాట్‌తో పోల్చారు. అందుకే వీరాచారవంతులు తమ పూర్వీకుల ఆయుధాలతో ఉత్సవాలకు వచ్చేటప్పుడు గంగధార మడుగులో స్నానమాచరించి పూజలు నిర్వహిస్తారు.



అయ్యప్ప భక్తులకు

తెలుగు వైద్యుల స్వచ్ఛంద సేవలు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

- శబరిమల, పంబలో ఓపీ వైద్యసేవలు
- 12 వైద్య బృందాలు..60 రోజులు సేవలు
- డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు29 (ఆంధ్రజ్యోతి): కేరళలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమలలో అయ్యప్ప భక్తులకు ఉచితంగా, స్వచ్ఛందంగా వైద్యసేవలు అందించేందుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఐఎంఏ వైద్యులు ముందుకొచ్చారు. శబరిమల, పంబలో 68 రోజుల పాటు 12 బృందాలు (ఒక్కొక్క బృందంలో ఆరుగురు వైద్యులు) స్వచ్ఛంధ వైద్యసేవలు అందించేందుకు ట్రావన్‌కోర్ దేవస్థానం బోర్డు, కేరళ రాష్ట్ర ప్రభుత్వం అనుమతించింది. డిసెంబరు, జనవరి మాసాల్లో వణికించే చలిలో అయ్యప్ప భక్తులు కొండపై ప్రయాణం చేయడం చేస్తుంటారు. దీంతో వేలాది మంది భక్తులు జలుబు, దగ్గు, జ్వరం, ఒళ్లు, కాళ్ళ నొప్పులకు గురౌతున్నారు. గతేడాది 45 లక్షల మంది అయ్యప్ప భక్తులు శబరిమలను సందర్శించగా, వీరిలో 32 మంది భక్తులు మృతి చెందారు. వీటిని గమనించిన అయ్యప్ప భక్తులైన వైద్యులు 'డివోటీ డాక్టర్స్ ఆఫ్ శబరిమల' పేరిట సంఘంగా ఏర్పడి డిసెంబరు, జనవరిలో శబరిమల, పంబలో భక్తులకు స్వచ్ఛంధ వైద్య సేవలు అందిస్తామని కోరగా, కేరళ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాలకు చెందిన 118 మంది ఐఎంఏ వైద్యులు, వారిలో తెలుగు రాష్ట్రాల నుంచి 25 మంది ఈ స్వచ్ఛంధ వైద్యసేవలో పాల్గొంటున్నారు. జనవరి 17వరకు ఈసేవలు కొనసాగుతాయి. ఈ విధుల్లో ఉండేవారిని 'కేరళ ప్రభుత్వ వైద్యులు'గా గుర్తింపునిస్తూ ఆ రాష్ట్ర ప్రభుత్వం వైద్యుల సేవలకు అరుదైన గౌరవం కల్పిస్తోంది.

అయ్యప్ప సేవలో తరించడం గొప్ప అదృష్టం..

పవిత్ర పుణ్యక్షేత్రమైన శబరిమలలో అయ్యప్ప భక్తులకు వైద్యసేవలు అందించే అవకాశం కలగడం తమ అదృష్టంగా ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. డిసెంబరు 1 నుంచి 5 రోజుల పాటు శబరిమల, పంబలో వైద్యసేవలు అందించేందుకు వెడుతున్న సందర్భంగా ఆయన శుక్రవారం గుంటూరులో విలేకరులతో మాట్లాడారు. తనతో ఆరుగురు వైద్య బృందం శబరిమల, పంబల్లో సేవలు అందించేందుకు వెడుతున్నట్లు తెలిపారు. సమావేశంలో శబరిమలవెళ్లే వైద్య బృందంలో సభ్యులైన డాక్టర్ మోపర్తి శ్రీనివాస్ (విజయవాడ), లావు సతీష్ (చిలకలూరి పేట), డాక్టర్ శ్రీనివాసరెడ్డి (గుంటూరు) పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఉరి వేసుకొని ప్లంబర్ ఆత్మహత్య

చిలకలూరిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శారద హైస్కూల్‌కు సమీపంలోని బచ్చు ఆదినారాయణ వీధిలో శుక్రవారం బూసి రత్నం (రవి) అనే ప్లంబర్ తన గృహంలో ఫ్యానుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటిలోని వారు ఎవరూ లేని సమయంలో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. చిలకలూరిపేట అర్బన్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొర్రె పిల్ల కడుపులో కిలోన్నర ప్లాస్టిక్ వ్యర్థాలు

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరేపల్లి గ్రామానికి చెందిన మిరపల్లి వెంకటేశ్వర్లుకు చెందిన గొర్రె గత ఐదు రోజుల నుంచి ఆహారం తీసుకోవటం లేదు. ఎన్ని మందులు వాడినా తగ్గకపోయేసరికి కర్లకుంట పశువైద్యుడు ఆవుల సాయి మహేష్‌రెడ్డికి చూపించారు. దీంతో ఆయన మరో వైద్యుడు శ్రీరామ్‌తో కలసి గొర్రె కడుపులో నుంచి కిలోన్నర ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్రాణాపాయ స్థితి నుంచి బయట పడింది. పశువుల యజమానులు తమ పశువులు ప్లాస్టిక్ వ్యర్థాలు తినకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు కోరారు.

శంకర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే అరవిందబాబు, జీకేఆర్

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్లలోని శంకరస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి అన్నాభిషేకం జరిగింది. పూజల్లో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గ్రామానికి విచ్చేసిన ఇరువురికి పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అలాగే మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వైసీపీ నాయకులతో కలిసి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను సన్మానించారు.

కామేశ్వర స్వామికి అన్నాభిషేకం

నరసరావుపేట అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట పట్టణంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని కామేశ్వరస్వామికి కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం అన్నాభిషేకం నిర్వహించారు. అర్చకులు చతుర్వేదుల భ్రమరకుమార్ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రామిరెడ్డిపాలెంలో కంటి వైద్య శిబిరం

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామిరెడ్డిపాలెంలో ఎంపీ రెడ్డి ఆస్పత్రి ఆధ్వర్యంలో, హ్యూమన్ రైట్ మానవ హక్కుల కౌన్సిల్ ఫర్ ఇండియా వారి ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. పల్నాడు జిల్లా అధ్యక్షుడు రాజనాల రాజీవ్‌రెడ్డి ప్రారంభించారు. 127 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా కంటి శుక్ల మందులు పంపిణీ చేశారు.

ద్విచక్రవాహన షోరూంలను సందర్శించిన విద్యార్థులు

రొంపిచర్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక టూర్లు విద్యార్థులకు ఎంతో దోహదపడతాయని పీఎం శ్రీపీపీ మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ రవినాయక్ శుక్రవారం తెలిపారు. పారిశ్రామిక సందర్శనలో భాగంగా నరసరావుపేటలోని పలు ద్విచక్ర వాహన షోరూంలను ఇంటర్ వొకేషన్ విద్యార్థులు సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవినాయక్ మాట్లాడుతూ విద్యార్థులు తరగతి గదుల్లో చదువుకోవటమే కాకుండా బయటకువెళ్ళి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుమల, నారపరెడ్డి పాల్గొన్నారు.

డిసెంబరు 2 నుంచి యోగ శిక్షణ

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం 182వ ఉచిత యోగ శిక్షణ శిబిరం డిసెంబరు 2 నుంచి ప్రారంభం అవుతుందని నరసరావుపేట శాఖ నిర్వాహకులు కూనిశెట్టి వెంకటజనార్ధన్ శుక్రవారం తెలిపారు. నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న వేంకటేశ్వర కళ్యాణ మండపంలో 28 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 7గంటల వరకు శిక్షణ తరగతులు జరుగుతాయన్నారు. 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు సూర్య నమస్కారాలు బోధిస్తామన్నారు. శిక్షణకు హాజరయ్యేవారు తప్పక బెడ్‌షీట్ తెచ్చుకోవాలన్నారు. అదనపు సమాచారం కోసం కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ, సెల్:9490846333, 9491665733 నంబర్లను సంప్రదించాలన్నారు.

వక్ఫ్‌భూములను కబ్జా చేస్తున్నారు: మౌలాలి

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గంలోని గుంటగార్లపాడులో వక్ఫ్ భూములను కబ్జా చేస్తున్నారని ఎంఐఎం పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి శుక్రవారం ఆరోపించారు. గార్లపాడు వక్ఫ్ బోర్డుకు సంబంధించిన పీర్లమాన్యం సర్వే నంబరు 75/3, 75/4 లో ఉన్న భూమిని కబ్జా చేసిన మాజీ కౌన్సిలర్, కొంతమంది భూబకాసురులు కిందిస్థాయి అధికారులతో కుమ్మక్కయ్యారన్నారు. కోట్ల రూపాయలు విలువైన భూమి కబ్జాచేసి ప్లాట్లుగా మారుస్తున్నా వక్ఫ్ బోర్డు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ఖాళీగాఉన్న వక్ఫ్ స్థలాన్ని గుర్తించి కబ్జాకు కాకుండా బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

హెచ్ఐవీ చట్టంపై అవగాహన సదస్సు

నరసరావుపేట లీగల్, నవంబరు 29, ఎయిడ్స్ డే సందర్భంగా శుక్రవారం పట్టణంలోని లింగంగుంట్ల కాలనీలోని పల్నాడు జిల్లా ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో హెచ్ఐవీ ఎయిడ్స్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాది చంద్రశేఖర్, టి.అమూల్య, మంత్రుల నాయక్ ఆర్ ఎమ్ ఓ ఏడుకొండలు వివిధ అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, టీఐ హాండ్స్ ఆఫ్ కంపాక్షన్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్, పీసీ గౌడ్ పాల్గొన్నారు.

బురద, గోతులతో ప్రయాణికులకు ఇక్కట్లు



జాలాది-గుత్తావారిపాలెం, కొప్పర్రు గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న జిల్లా పరిషత్ రోడ్డు

- జాలాది-గుత్తావారిపాలెం, కొప్పర్రు మధ్య అధ్వానంగా జడ్పీ రహదారి
- పెదనందిపాడు వెళ్లాలంటే 15కి.మీ. చుట్టుతిరిగి రావాల్సిందే
- బీటీ రోడ్డు ఏర్పాటుచేస్తే 20 గ్రామాల ప్రజలకు ఉపయోగకరం

యడ్లపాడు, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): గుంతలతో బురదమయంగా ఉన్న రహదారిపై ప్రయాణం ప్రజలకు నరకప్రాయంగా ఉంటోంది. మండలంలోని జాలాది-గుత్తావారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి పెదనందిపాడు మండలంలోని కొప్పర్రు ఆర్‌అండ్‌బీ రోడ్డును కలుపుతూ 2కి.మీల గ్రావెల్ రోడ్డును జడ్పీ నిధులతో ఏర్పాటు చేశారు. దీంతో పెదనందిపాడు మండలంలోని గ్రామాలకు వెళ్లేందుకు మార్గం సుగమమైంది. గతంలో పెదనందిపాడుకు వెళ్ళాలంటే ప్రత్తిపాడు మీదుగా సుమారు 15కి.మీలు చుట్టు తిరిగి వెళ్లాల్సివచ్చేది. ఈ రోడ్డు ఏర్పాటుతో దూరం తగ్గి ప్రయాణసమయం కూడా ఆదా అవుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కనీస మరమ్మతులకు నోచుకోకపోవడంతో వాహనాలు తిరిగి పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. వర్షాలకు రోడ్డు అక్కడ అక్కడ కోతకు గురైంది. గోతులలో ఇప్పటికీ నీరు నిలిచి బురదగా ఉంటోంది. అంతేగాకుండా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి ప్రయాణానికి ఇబ్బందికరంగా ఉంటోంది. కనీసం ద్విచక్రవాహనం కూడా వెళ్ళలేని పరిస్థితి నెలకొంది. పాడైన రోడ్డుకు మరమ్మతులు నిర్వహిస్తే రెండు మండలాల్లోని 20గ్రామాల ప్రజలకు మేలు కలుగుతుంది. ప్రస్తుతం ఉన్న గ్రావెల్ రోడ్డు స్థానంలో బీటీ రోడ్డును ఏర్పాటుచేయాలని ఇరు మండలాల ప్రజలు కోరుతున్నారు. రోడ్డు నిర్మాణంతో ప్రయాణికులతోపాటు గుత్తావారిపాలెం, జాలాది, కొప్పర్రు, తుర్లపాడు గ్రామాలకు చెందిన రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను తరలించేందుకు ఎంతో దోహదపడుతుందని చెబుతున్నారు.

రహదారి నిర్మాణంతో ఎంతో ఉపయోగం

- కందిమళ్ళ రఘురామారావు, మాజీ ఎంపీపీ

జాలాది-గుత్తావారిపాలెం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి కొప్పర్రు గ్రామం పక్కగా పెదనందిపాడు వెళుతున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుకు అనుసంధానం చేస్తూ 2కి.మీల మేర బీటీ రోడ్డు నిర్మాణం చేస్తే ఇరు మండలాల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. ప్రస్తుతం పెదనందిపాడుకు వెళ్లాలంటే 15కి.మీలకు పైగా ప్రత్తిపాడు మీదుగా లేదా చిలకలూరిపేట మీదుగా 20కి.మీలు చుట్టు తిరిగి వెళ్ళాల్సి వస్తోంది. ఈ విషయమై అంచనాలు తయారు చేయించి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ద్వారా జిల్లా పరిషత్ చైర్మన్‌కు విన్నవించడం జరిగిందన్నారు. త్వరగా అనుమతులు మంజూరు అవసరమైన నిధులను కేటాయించాలని విజ్ఞప్తి చేశామన్నారు.

వాదోపవాదాల మధ్య ముగిసిన కౌన్సిల్ సమావేశం

- గతంలో రద్దుచేసిన అంశాన్ని సభలో ప్రవేశపెట్టడంపై అభ్యంతరం

వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ సాధారణ సమావేశం వాడివేడిగా జరిగింది. గతంలో ఎజెండాలోని అంశాలను రద్దుచేసిన అంశాన్ని తిరిగి ఆమోదించడంపై 8వ వార్డు కౌన్సిలర్ పాపసాని బ్రహ్మయ్య చైర్మన్‌ను నిలదీశారు. చైర్మన్, బ్రహ్మయ్యల మధ్య సుమారు పావుగంట సేపు వాగ్వివాదం జరిగింది. ఎమ్మెల్యే సిఫారసు మేరకే ఎజెండాలో ప్రవేశపెట్టడం జరిగిందని, అభ్యంతరం వ్యక్తం చేస్తే రద్దు చేస్తామని తెలిపారు. ముందు సభలో చెప్పింది వినాలని, పెట్టకూడదనే హక్కు లేదని చైర్మన్ బ్రహ్మయ్యకు వివరించారు. ఎజెండాలోని 55వ అంశమైన పురపాలక డీ, ఓ ట్రేడ్ లైసెన్స్ ఫీజులు పెంపుదల అంశంపై ఒకరిపై ఒకరు విమర్శలకు దిగారు. సభ ప్రారంభానికి ముందు సభకు వచ్చిన చైర్మన్ సభ్యుల కోసం ఎదురుచూడాల్సి వచ్చింది. కేవలం 8మంది కౌన్సిలర్లు మాత్రమే సభకు హాజరుకాగా సభ ప్రారంభించవచ్చునని కమిషనర్ చైర్మన్‌కు సూచించారు. పట్టణంలోని వక్ఫ్‌బోర్డు స్థలాలకు డాక్యుమెంటేషన్ సరిగా లేకపోవడం, ఇళ్ళ ప్లాన్ ఇవ్వడం వీలుకానందున మునిసిపాలిటీ అనుమతి లేకుండా 32వ వార్డులో ఇళ్ళు నిర్మాణం జరుపుకుంటున్నారు. కాని వారు రెండు, మూడు అంతస్తుల నిర్మాణం చేపడుతున్నారు. భవిష్యత్తులో మాస్టర్ ప్లాన్ ఇంప్లిమెంటేషన్‌కు కొత్త కాలనీ అభివృద్ధి రోడ్డు, డ్రైనేజీ నిర్మాణాలకు తీవ్ర విఘాతం కలుగుతుందని ఈ అంశంపై గ్రౌండ్‌ఫ్లోర్ నిర్మించుకునేవారికి రూ.15వేలు, రెండో ఫ్లోర్ నిర్మాణం చేసుకునేవారికి రూ.30వేలు చొప్పున అనగా ఫ్లోర్‌కు రూ.15వేలు చొప్పున బిల్డింగ్ నిర్మాణ సమయంలో మున్సిపాలిటీకి చెల్లించే విధానాన్ని చైర్మన్ రద్దుచేశారు. మొత్తం 64 అంశాలను సభలో ప్రవేశపెట్టగా 63అంశాలను సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

నరసరావుపేటను సుందరీకరిస్తున్నాం: ఎమ్మెల్యే అరవిందబాబు

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలలోనే నరసరావుపేట పట్టణాన్ని సుందరీకరిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శుక్రవారం నరసరావుపేట పట్టణం ఒకటో వార్డులో శానిటేషన్ ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ ప్రతి పనికి ప్రభుత్వం మీద ప్రజలు ఆధారపడకుండా ఉండటంమే కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌కు అధికారులు, ప్రజలు పూర్తిగా సహకరిస్తున్నారని అన్నారు. జనవరి తర్వాత రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలకు మరిన్ని నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఉమ్మడి ప్రణాళిక ద్వారా ప్రతి పనిని దగ్గరుండి పూర్తి చేసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ. జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి: డీడీఏ శివకుమారి

వినుకొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి పంటలో ఉల్లికోడుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పల్నాడు జిల్లా అగ్రికల్చర్ వ్యవసాయ డిప్యూటీ డైరెక్టర్ యం.శివకుమారి తెలిపారు. మండలంలోని ఉమ్మడివరం గ్రామ సమీపంలోని కంది, వరి, మిరప పంటలను శుక్రవారం ఆమె పరిశీలించారు. ప్రధానంగా వరి పంటకు ఉల్లికోడు, బాక్టీరియా ఆకు ఎండుతెగుల ఉధృతి ఉన్నట్లు గమనించారు. తెగుళ్ల నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి మండల వ్యవసాయాధికారి సుగుణబేగం, వ్యవసాయ సహాయకులు చాందిని, యశ్వంత్ పాల్గొన్నారు.

- నూజెండ్ల: రైతులు పంటల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా పెట్టుబడులు తగ్గి దిగుబడులు పెరిగి వ్యవసాయం లాభసాటిగా ఉంటుందని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ ఎం శివకుమారి అన్నారు. మండలంలోని కంభంపాడు, పమిడిపాడులో శుక్రవారం వ్యవసాయ అధికారులు రైతులతో కలసి వరి, మిర్చి, కంది పైరును పరిశీలించారు. ఈ సందర్భంగా శివ కుమారి మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రైతులకు అవసరమైన సమాచారాన్ని త్వరితగతిన అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏవో సుగుణాబేగం, ఏఈవో ఎలీషా, గ్రామ వ్యవసాయ సాహాయకులు హిమబిందు, కోటయ్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు టీఎన్‌యూఎస్ సభ్యత్వం

వినుకొండ టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో టీఎన్‌యూఎస్ పల్నాడు జిల్లా కార్యదర్శి కె శ్రీరామకృష్ణ సభ్యత్వ నమోదు కార్యక్రమం గురువారం చేపట్టారు. ఈ సందర్భంగా పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ బాలుర పాఠశాల్లో ఉపాధ్యాయులతో 100 సభ్యత్వాల నమోదు చేయించారు. అనంతరం రాష్ట్ర నాయకులు మన్నం శ్రీనివాస్, వినుకొండ యూనియన్ నాయకులు మారావులను అభినందించారు.

ఉపాధ్యాయులకు పెండింగ్ బకాయిలు చెల్లించాలి

- ఎన్టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు

శావల్యాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు గతంలో రావల్సిన పెండింగ్ బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఎన్టీఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఎన్టీఏ సభ్యత్వ నమోదులో భాగంగా శావల్యాపురం జడ్పీ పాఠశాలల్లో ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం ఆయన పోస్టర్లను ఆవిష్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు 11వ పీఆర్సీ బకాయిలు, 90 నెలల డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని ప్రభుత్వం ఎప్పుడు చెల్లిస్తుందో తెలియజేయాలన్నారు. ప్రభుత్వం 12వ పీఆర్సీ కమిషన్ నియమించి మధ్యంతరభృతి ప్రకటించాలని కోరారు. అపార్ బాధ్యతలతో ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం అపార్‌ను వెంటనే తొలగించాలని, అనవసరపు యాప్‌లను వెంటనే రద్దు చేయాలని, పాఠశాలలలో తెలుగు మాధ్యమాన్ని పునరుద్ధరించాలని కోరారు. హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి, కార్యవర్గ సభ్యులు గద్దె రామకోటేశ్వరరావు, మురుగొండ శ్రీనివాసరావు, జాకీర్ హుస్సేన్, చేవూరి రమేష్ పాల్గొన్నారు.



బడి మానివేసిన విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో సాంబశివరావు

విద్యార్థులంతా పాఠశాలల్లో చేరాలి: ఎంఈవో సాంబశివరావు

శావల్యాపురం, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): వివిధ కారణాలతో పాఠశాలలు మానుకొన్న విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని తిరిగి పాఠశాలలలో చేరాలని మండల విద్యాశాఖాధికారి మద్దిగుంట్ల సాంబశివరావు అన్నారు. మండలంలోని పోట్లూరు గ్రామ సమీపంలోని కొంకేరువాగు వద్ద ముగ్గురు పిల్లలు బడిమానేసి చేపలు పట్టుకొంటున్న విషయాన్ని తెలుసుకొని ఎంఈవో సాంబశివరావు తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం రాజారమేష్, ఉపాధ్యాయులు రవికుమార్‌లతో కలసి శుక్రవారం వారి వద్దకు వెళ్లారు. ముగ్గురు విద్యార్థులు బడి మానేయడానికి గల కారణాలు తెలుసుకున్నారు. వారి తల్లిదండ్రులను కలసి చదువు ప్రాముఖ్యం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి తెలియజేశారు. ఎంఈవో, ఉపాధ్యాయులు చెప్పగానే స్పందించిన తల్లిదండ్రులు ముగ్గురు పిల్లల్ని పోట్లూరు జడ్పీ పాఠశాలలో చేర్పించారు.

చెల్లని చెక్కు కేసుల్లో నిందితులకు జైలు

నరసరావుపేట లీగల్, నవంబరు 29, వేర్వేరు చెల్లని చెక్కు కేసుల్లో నేరం రుజువు కావడంతో నిందితులు నరసరావుపేటకు చెందిన దుడ్డు కాశీ వరప్రసాద్ , బత్తులవెంకటేశ్వర్లుకు ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్ష విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి టి.ప్రవళిక శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి పట్టణానికి చెందిన బూదే సాంబశివరావు వద్ద 2020 ఫిబ్రవరి 2న నిందితుడు బత్తుల వెంకటేశ్వర్లు తొమ్మిది లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ప్రామిసరీ నోటు రాసిఇచ్చాడు. చెల్లింపులో భాగంగా 2021 జనవరి 25న 9లక్షలకు బత్తుల వెంకటేశ్వర్లు సాంబశివరావు చెక్కుఇచ్చాడు. సాంబశివరావు చెక్కును బ్యాంక్ ఖాతాలో వసూలుకు వేసుకున్నాడు, అది చెల్లలేదు ఈ మేరకు సాంబశివరావు కోర్టులో కేసు దాఖలుచేసుకున్నాడు. విచారణలో నేరం రుజువు అవడంతో ఆరు నెలల జైలు శిక్ష, రూ.తొమ్మిది లక్షలు ఫిర్యాదుకు చెల్లించాలన్నారు. చెల్లించిన పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. కాగా మరో కేసులో నిందితుడు పట్టణానికి చెందిన దుడ్డు కాశీ వరప్రసాద్ 2018 ఏప్రిల్ 1న గుండా కరుణాకర్‌రావు వద్ద రూ.5లక్షలు అప్పుగా తీసుకున్నాడు. చెల్లింపుల్లో భాగంగా ఐదు లక్షల రూపాయలకు చెక్కు ఇచ్చాడు, అది చెల్లలేదు. ఈ మేరకు ఫిర్యాది కరుణాకర్‌రావు కోర్టులో కేసు దాఖలుచేసుకున్నాడు. విచారణలో నేరం రుజువు కావడంతో ఆరు నెలలు జైలు శిక్ష, రూ.ఐదు లక్షలు ఫిర్యాదుకు నష్టపరిహారం చేల్లించేలా కోర్టు తీర్పు వెలువడింది.

ఖాళీ పోస్టులను వీఆర్‌ఏతో భర్తీ చేయాలి

- సంఘం నాయకుల వినతి



జిల్లా రెవెన్యూ అధికారి మురళికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్‌ఏల సంఘ నాయకులు

నరసరావుపేట రూరల్, నవంబరు 29: రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో ఖాళీగా ఉన్న అటెండర్, నైట్ వాచ్‌మన్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులను వీఆర్ఏలతో భర్తీచేయాలని వీఆర్ఏల సంఘం నాయకులు జిల్లా రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. గ్రామ రెవెన్యూ సహాయకుల సమస్యలు పరిష్కారం చేయాలని పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయ డీఆర్వో మురళికి వీఆర్ఏల సంఘ నాయకులు శుక్రవారం కలసి వీఆర్ఏల సమస్యలను పరిష్కరించాలని కోరారు. డీఆర్వో మురళి సానుకూలంగా స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో పల్నాడు వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు షేక్ బందగి సాహెబ్, నరసరావుపేట మండల అధ్యక్షులు రోశయ్య, ప్రధాన కార్యదర్శి రఫీ, సత్తెనపల్లి మండల అధ్యక్షులు రవి, ప్రధాన కార్యదర్శి మునాఫ్, రొంపిచర్ల మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జాయింట్ సెక్రెటరీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌కాల్ చేసి నగదు దోపిడీకి యత్నం

వేల్పూరు (శావల్యాపురం) నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): అపరిచిత వ్యక్తులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు వాట్సప్ ద్వారా కాల్స్ చేస్తూ వారివద్ద నగదు దోచుకునేందుకు ప్రయత్నిస్తున్న ఘటనలు ఇటీవల తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. మండలంలోని వేల్పూరుకుచెందిన సాదినేని సీతారామయ్యకు శుక్రవారం ఉదయం 10.30గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు పోలీసులమంటూ వాట్సప్ ద్వారా ఫోన్‌చేసి మీ కుమారుడు మారక ద్రవ్యాలను రవాణాచేస్తూ పోలీసులకు చిక్కాడని, 20ఏళ్ళు జైలులో ఉండాల్సి వస్తుందని, ఫోన్‌పే లేదా గూగుల్‌పే ద్వారా రూ.50వేలు పంపిస్తే అతన్ని వదిలేస్తామన్నారు. సీతారామయ్య కొంత సమయం కావాలని వారితో చెప్పి కేరళలో ఎన్ఐటీలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న తన కుమారునికి ఫోన్ చేశాడు. తాను తరగతిలో ఉన్నానని, తననెవ్వరూ అరెస్టు చేయలేదని కుమారుడు చెప్పడంతో సీతారామయ్య ఈ విషయం ఎస్ఐ లోకేశ్వరరావుకు తెలియజేశారు. ఇటీవల శావల్యాపురానికి చెందిన వ్యక్తికి కూడా అపరిచిత వ్యక్తులు ఇలానే ఫోన్‌చేసి నగదు డిమాండ్ చేశారు. దీనిపై ఎస్ఐ లోకేశ్వరరావు మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి నగదు డిమాండ్ చేస్తే ఇవ్వవద్దని, విషయాన్ని వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు.

ఆహ్లాదాన్ని కల్గించేలా కళాసాగరిక కార్యక్రమాలు: మాజీ ఎమ్మెల్యే మక్కెన

వినుకొండ, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మనసుకు ఆహ్లాదాన్ని కలిగించేలా కళాసాగరిక కార్యక్రమాలుంటాయని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలో కళాసాగరిక ట్రస్టు, రోటరీక్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ సంయుక్తంగా నిర్వహించిన ఘంటసాల గానామృతం సాంస్కృతిక కార్యక్రమాలను గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు వివిధ రంగాల్లో ప్రతిభకనపర్చిన ఒంగోలుకు చెందిన కొమ్ము విజయ్‌కుమార్, పూర్ణిమ దంపతులకు కళాసాగరి, ప్రపూర్ణ అవార్డుతో సత్కరించారు.

జాబ్ మేళాలలో 70 మందికి ఉద్యోగాలు

నాదెండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గణపవరంలో చుండి రంగనాయకులు కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా జాబ్ మేళాకు నాలుగు కంపెనీలు హాజరయ్యాయి. మొత్తం 108 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరు కాగా 70 మంది ఎంపికైనట్టు జిల్లా అధికారి తమ్మాజీరావు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సీహెచ్ చైతన్య, ఈఈ జేఈవో రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచండి

- మునిసిపల్ అధికారులతో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి డ్రెయినేజ్‌లపై ఆక్రమణలను తక్షణమే తొలగించి డ్రెయిన్లను బాగుచేసి మురుగునీరు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ అధికారులను మాజీమంత్రి, ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ఆదేశించారు. శుక్రవారం తన నివాసంలో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇటీవల జూలై నెలలో పట్టణంలోని ప్రధాన రహదారుల వెంబడి ఆక్రమణలు తొలగించి డ్రెయిన్‌లు బాగుచేసిన కారణంగా ఆగస్టు నెలలో పెద్దఎత్తున వర్షాలు పడినప్పటికీ ఎక్కడా చుక్కనీరు కూడా పట్టణంలో నిలబడకుండా, ప్రజారోగ్యాన్ని కాపాడటం జరిగిందన్నారు. మునిసిపల్ కమిషనర్ మాట్లాడుతూ ఎస్ఎస్ఆర్ 2025, ఎమ్మెల్సీ ఓట్ల వెరిఫికేషన్, వార్డుల్లో జియో ట్యాగింగ్ వంటి విధులతో సిబ్బందికి పని ఒత్తిడి ఉన్న కారణంగా ఆక్రమణల తొలగింపు అంశం కొంత ఆలస్యమైందని, మరో రెండు రోజుల్లో మార్కింగ్ ఇచ్చి ఆక్రమణలు తొలగిస్తామని ఆయన తెలియజేశారు. సమావేశంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారి పీ సుజాత, వారి సిబ్బంది, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రమేష్, సర్వేయర్ దర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్ బుక్‌తో వైసీపీ నేతలలో వణుకు

- టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ చెప్పినట్లే రెడ్‌బుక్ తెరుచుకోవడంతో వైసీపీ నేతలలో వణకు మొదలైందని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ శుక్రవారం ఒక ప్రకటనలో అన్నారు. నాడు అధికారం చేతులలో ఉంది కదా అని చంద్రబాబునాయుడు, లోకేశ్, పవన్ కల్యాణ్ కుటుంబ సభ్యులపై అనుచిత వాఖ్యలు, అసభ్య పోస్టులు పెట్టిన వారందరికీ ఇప్పుడు తత్వం బోధపడుతోందన్నారు. సోషల్ మీడియా వేదికగా గత ఐదేళ్ళు అడ్డగోలుగా పోస్టులు పెట్టిన వైసీపీ పేటీఎం బ్యాచ్ వ్యక్తిత్వ హననానికి పాల్పడ్డారని మండిపడ్డారు. ఇప్పుడు ఆ బ్యాచ్ అంతా ఒక్కొక్కరు అరెస్టు అవుతుండడంతో వారి పేర్లు ఎక్కడ బయటకు వస్తాయో అని వైసీపీ నాయకులలో వణకు మొదలైందన్నారు. కూటమి ప్రభుత్వం తప్పుచేసిన వారిని చట్ట ప్రకారమే శిక్షిస్తుందన్నారు.

ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులుగా డాక్టర్ ముద్దన, డాక్టర్ మక్కెన



డాక్టర్ ముద్దన రమేష్ బాబు , డాక్టర్ మక్కెన వంశీకృష్ణ

చిలకలూరిపేట, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ ముద్దన రమేష్ బాబు (జయా నర్సింగ్ హోమ్), డాక్టర్ మక్కెన వంశీకృష్ణ (కొమ్మినేని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి) శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వారు ఏడాది పాటు ఆ పదవులలో కొనసాగుతారు. రాష్ట్ర హాస్పిటల్ బోర్డు ప్రధాన కార్యదర్శి డాక్టర్ ముప్పాళ్ళ హనుమంతరావు ఈ ఎన్నికను నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన పట్టణ డాక్టర్లు డాక్టర్ ముద్దనను, డాక్టర్ మక్కెనను అభినందించారు.



వినుకొండ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

డీఈవో ఆకస్మిక తనిఖీ

వినుకొండ టౌన్, నవంబర్ 29 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలతోపాటు వెంకుపాలెం ప్రాథమిక పాఠశాల డీఈవో చంద్రకళ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. తరగతి వాతావరణం, విద్యార్థులు నేర్చుకుంటున్న ఫలితాలను గమనించి ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 26వేల మంది పదో తరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధమవుతున్నారని, ఉదయం సాయంత్రం స్టడీ అవర్స్‌తోపాటు ప్రతిరోజు ఒక సబ్జెక్టుపై పరీక్షలు నిర్వహించి విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందిస్తున్నామని అన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

నాదెండ్ల, నవంబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో అసంపూర్తిగా చేసిన విద్యుత్ పనులను ఆ శాఖ ఏడీఈ, ఏఈలు అశోక్ కుమార్, ప్రసాదులు శుక్రవారం పరిశీలించారు. ఐదు వేల జనాభా దాటిన మేజరు పంచాయతీల్లో కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు త్రీఫేజ్ విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసే పథకం యెక్క పురోగతిని విద్యుత్ శాఖ అధికారులతో శుక్రవారం సమీక్షించారు. చిలకలూరిపేట, యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లోని మేజరు పంచాయతీలు ఈ పథకం కింద చేర్చారు.